S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 53 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 4 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

# ఇప్పటికే 60వేల ఉద్యోగాలు
# త్వరలో 40వేలు

“ పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్ లను ఏకగ్రీవం చసు్నకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ”

## ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం

- ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం
- రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**సిద్దిపేట, డిసెంబరు 3:** రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు

మిగతా 2 లో





## భూదార్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- భూ భారతిని సమగ్రంగా తయారు చేశాం
- ప్రజలు మెచ్చే విధంగా భూభారతి చట్టం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి

02



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

02

- ఐదుగురు మావోలు..ఒక పోలీస్ మృతి

## తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు..
- భట్టితో కలసి ఆహ్వానించిన సీఎం రేవంత్

దేవుళ్లపై తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం



2



13 మంది కుటుంబ సభ్యుల

## కాల్చివేత

హంతకుడికి బహిరంగ మరణం

బాలుడితో కాల్చి చంపించిన అఫ్ఘాన్ పోలీసులు

.. వివరాలు 4లో



ఢిల్లీ మున్సిపల్ ఉప ఎన్నికల్లో

## బీజేపీ సత్తా

- 12 స్థానాల్లో 7 గెలుపు.. ఆప్‌కు 3
- కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెరో సీటు

.. వివరాలు 4లో




## కాసుల కోకాపేట

హెచ్ఎండీఏ ఖాతాలో మరో వేయికోట్లు

.. వివరాలు 2లో

# మహానగరంగా ఇక హైదరాబాద్



- 27 మున్సిపాలిటీల విలీనం
- మున్సిపల్ రికార్డులను స్వాధీనం
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఆదేశాలు జారీ

3



3

## హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

- గాంధీభవన్ ముట్టడికి బీజేపీ యత్నం
- అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత

నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి.

కోతులను పారదోలే వారే

## ఓట్లకు రండి

రేగొండ గ్రామంలో పోస్టర్ వేసిన యువత

కోతుల బెడద తప్పించే వారికే ఓటేస్తామని హెచ్చరిక

3





కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో

## బాంబు కలకలం

బాంబు సంచిని నోట కరిచిన కుక్క మృతి

2

## పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం

ఇప్పటికే ఇద్దరు మృతి.. కొందరికి లక్షణాలు




**పల్నాడు :** పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం సృష్టిస్తుంది. ఈ లక్షణాలతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. అలానే మరొకరు చికిత్స పొందుతున్నారు. మ-ంప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి జ్వరం, ఒంటినొప్పులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మరణించింది. రాజుపాలెంకు చెందిన వృద్ధురాలు నాగమ్మ కూడా జ్వరంతో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మృతి చెందింది. అలానే రాజుపాలెం

మిగతా 5 లో



## వివేకా హత్యపై సీబీఐ కోర్టులో సునీత కేసు

త్వరగా విచారణ జరపాలని వినతి

**కడప :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐ కోర్టులో ఆయన కూతురు సునీతారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై

మిగతా 5 లో

# రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

రైతన్నకు అండగా ఉండడమే మా విధానం

సీఎం చంద్రబాబు



**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కనుక రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. రైతన్నకు అండగా ఉంటామనేది మా మొదటి నినాదం అన్నారు.. నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు బుధరం పర్యటించారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు కుటుంబాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. సూపర్

మిగతా 5 లో

## ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

రాష్ట్ర స్థాయిలో అమరావతిలో 'దివ్యాంగ్ భవన్' ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

5



# కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో బాంబు కలకలం

## బాంబు సంచిని నోట కరిచిన కుక్క మృతి

**భద్రాద్రికొత్తగూడెం, డిసెంబర్ 3:** కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. గురువారం ఉదయం ఆగంతకుడు స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై నల్ల సంచి ఉంచి వెళ్లిపోయాడు. అందులో ఏముందో ఎవరు పట్టించుకోలేదు. ఆ సంచిని వీధి కుక్క రైల్వే ట్రాక్‌పైకి నోటితో లాక్కెళ్లింది. ఆ సంచిలో ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న బాంబును కుక్క కొరింది. దీంతో భారీ శబ్దంతో బాంబు పేలుడు సంభవించింది. కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఈ బాంబు పేలుడుతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు దర్యాప్తు చేపట్టారు. ఇంకా ఏమైనా బాంబులు ఉన్నాయా అంటూ పోలీస్ జాగిలాలతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆగంతకుడు ఎటువైపు నుంచి వచ్చాడు. ఎటువెళ్లాడనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ఎనిమిదేండ్ల చిన్నారిపై లైంగికదాడికి యత్నం

**వరంగల్, డిసెంబర్ 3:** వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం చేశాడు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో వేల్పుల కమల్ అనే యువకుడు కిరాణా షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల రెండవ తేదీ రాత్రి కిరాణా దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిన 8 ఏళ్ల బాలికను లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆ సమయంలో దుకాణానికి వేరే వారు రావడంతో పాప బయటికి పరిగెత్తుకుంటూ వెళ్లి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలిపింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భూదార్ కార్డులపై కీలక నిర్ణయం

## రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి




**హైదరాబాద్,డిసెంబర్3:** భూదార్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు. 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపర మైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని..ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువచ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలో ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామన్నారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధంగా ఉన్నాయన్నారు. భూభారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ధరణిని బీఆర్ఎస్ సర్కార్ విదేశీ సంస్థకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక భూ భారతిని కేంద్ర సంస్థకు అప్పగించామన్నారు. భయంకరమైన ధరణి వెబ్ సైట్ ను బంగాళాఖాతంలో పడేశామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత నక్షల్లేని గ్రామాల్లో సర్వేలు చేసి భూధార్ కార్డులిస్తామని తెలిపారు. ధరణి వెబ్ సైట్ తో బీఆర్ఎస్ రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు.ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 6వేల మంది వీఆర్ఏలను నియమించామని తెలిపారు. 490మంది సర్వేయర్లకు లైసెన్స్‌లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి సర్వేయర్లను అలాట్ చేశామని తెలిపారు. రోవర్స్ కొనుగోలు చేసి సర్వేయర్లకు అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని..తమ ప్రభుత్వం సరిచేస్తున్నామని వివరించారు. 59 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను అధునాతనంగా నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

## హెచ్ఎండీఏ ఖాతాలో మరో వేయికోట్లు




**హైదరాబాద్, డిసెంబర్ 3:** కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం ప్రక్రియ ముగిసింది. బుధవారం ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ-వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. 8.04 ఎకరాలకు హెచ్ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ-వేలం వేయనుంది.

# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

మొదటి పేజీ తరువాయి

ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాధ్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు.



50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలస్వతం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ంఊఅ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్- కొత్తపల్లి ప్యాకేజీ-1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్- అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..

# ఆటోలో ఇద్దరి మృతదేహాలు




**హైదరాబాద్, డిసెంబర్ 3:** నగరంలోని చాంద్రాయణగుట్టలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. రోమన్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ ఆటోలో ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకోవడంతోనే వారు మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. అక్కడ మూడు సిరంజీలు లభ్యమయ్యాయి. మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్ సాయం తో ఆధారాలు సేకరించారు. అక్కడ మూడు సిరంజీలు లభించాయి. దీంతో అధిక మోతాదులోడ్రగ్స్ తీసుకోవడంతోనే వారు చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటషన్
- భట్టితో కలసి ఆహ్వానించిన రేవంత్
- దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం





**న్యూఢిల్లీ, డిసెంబర్3:** దేశ రాజధాని దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

# మూగ బాలుడిపై కుక్కల దాడి

## మెరుగైన వైద్యం అందించాలని రేవంత్ ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 3: హయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు. స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని



ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిలోఫర్ ఐసీయూలో బాలుడికి ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.

# పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

- తెలంగాణకు ఏనాడూ మద్దతు ఇవ్వని పవన్
- మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, డిసెంబర్ 3:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా స్పందించారు. ఎల్బీనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన కవిత, పవన్ కళ్యాణ్ మాత్రం ఆనాటి నుంచి ఇనాటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని అనడంపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఏనాడూ దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది, మేము పెద్దగా ఆలోచిస్తాం అని ఆమె అన్నారు. తమ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా, ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే తాము కోరుకున్నామని, తెలంగాణ ఎంత బాగుందో ఆంధ్రా కూడా అంతే బాగుండాలని ఆకాంక్షించామని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్‌లో కూడా మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలని కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం. అలా అనుకొని ఉంటే తెలంగాణ ఉద్యమ స్వరూపం వేరేలా ఉండేది. మా బిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారే తప్ప, ఒక్క పరాయి రాష్ట్రం వారి మీద కూడా చేయి ఎత్తలేదఅని కవిత వివరించారు. ఆనాడు సినిమా నటుడిగా మాట్లాడారు కానీ, ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అని, ఆయన మాటలు ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారని కవిత హెచ్చరించారు. కనుక పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా ఆలోచన చేసి మాట్లాడాలని ఆమె సూచించారు.

# కోతులను పారదోలే వారే ఓట్లకోసం రండి

## రేగొండ గ్రామంలో పోస్టర్ వేసిన యువత

## కోతుల బెడద తప్పించే వారికే ఓటేస్తామని హెచ్చరిక



**జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 3:** సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రజలు కూడా ప్రధాన సమస్యలపై నిలదీస్తున్నారు. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు అడగడానికి వస్తే.. ఎవరైనా తమ ఊరిని అభివృద్ధి చేయాలని అడుగుతారు. విద్యుత్, నీటి కొరత వంటి సమస్యలను పరిష్కారం చేయాలని కోరతారు. అయితే.. రేగొండ మండల ప్రజలు మాత్రం ఓ విచిత్ర కోరిక కోరారు. ఆ ఊర్లో వానరాల బెడద అధికమవడంతో.. ముందుగా వాటిని తరిమేయాలని సర్పంచ్ అభ్యర్థులను వేడుకుంటున్నారు. కోతులను ఊరి నుంచి దాటించాకే ఓట్ల ప్రచారం కోసం రండి.. లేదంటే ఓట్లు అడగవద్దని బహిరంగంగా పోస్టర్ కూడా వేశారు. ఆ పోస్టర్లో ఇంకా ఏముందంటే...'మా ఓటును అమ్మేది లేదు.. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయొద్దు. వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామీణాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా వానరాల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు.. కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్ద సార్లు, పెద్ద పెద్ద లీడర్లు తిరుగుతున్నా.. మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. ఎన్నికల వేళ మా ఇల్లు తొక్కే నాయకుల్లారా.. కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి.. మీ చిత్తశుద్ధిని చాటుకోండి.' అని స్థానిక ఇన్‌స్పైర్ యూత్ అసోసియేషన్ తరఫున ఓ పోస్టర్‌లో రాసిపెట్టి అందరికీ కనిపించేలా వీధిలో గోడకు అతికించారు. రేగొండలో గోడకు అతికించిన పోస్టర్ ప్రస్తుతం.. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీన్ని బట్టి ఆ ఊరి ప్రజలు కోతుల ద్వారా ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారో అర్థమవుతోందని నెట్టింట చర్చించుకుంటున్నారు. వారి న్యాయబద్ధమైన కోరికను నెరవేర్చి సర్పంచ్ అభ్యర్థులు చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. 193 మండలాల్లోని 4,332 గ్రామ పంచాయతీలు; 38,342 వార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించారు. రెండో విడత నామినేషన్లను బుధవారం పరిశీలిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.



# హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

## గాంధీభవన్ ముట్టడికి బీజేపీ యత్నం ● అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత

**హైదరాబాద్, డిసెంబర్ 3:** నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

# రబీ యూరియా కోసం రైతుల క్యూ

**వరంగల్, డిసెంబర్ 3:** మళ్లీ యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రబీకి ఎక్కడ దక్కదో అన్న ఆందోళనతో క్యూ కట్టారు. రబీ సీజన్లోనూ యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నల్లబెల్లిలోని వీఎఫ్‌జీ సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో బుధవారం వేకువజామునే రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలతో కుమ్మక్కై ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. కృత్రిమ ఎరువు కొరత సృష్టిస్తున్నారని వారు ఆక్షేపించారు. ఇలా అమ్ముతుండటంతో ప్రైవేట్ దుకాణాలలో కొనుగోలు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

## మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 3:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీ. కేటీఆర్.. ఇక్కడ రాజకీయం చేయి.. సీఎం, పీసీసీ చీఫ్, మేమంతా సిద్ధం. రాహుల్ గాంధీని విమర్శిస్తే విడిచిపెట్టనని జగ్గారెడ్డి అన్నారు.

# రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



**న్యూఢిల్లీ,డిసెంబర్3 :** క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' హిల్ట్ పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ది చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు.

# ఓయూలో పాడైన అన్నం

## విద్యార్థుల ఆందోళన కనువిప్పు కావాలి

## సిఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్ 3:** మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా రేవంత్ పాలన తీరు ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వేయి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేక పోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం.. ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని హరీశ్‌రావు హితవుపలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టండని సూచించారు.

# మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

## విద్యార్థుల మధ్య పరస్పరం గొడవ

**సంగారెడ్డి,డిసెంబరు 3:** సంగారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ ని సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. ఎందుకు ర్యాగింగ్ చేస్తున్నారంటూ సీనియర్స్ పై విద్యార్థి సోదరుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆగ్రహంతో శాంతినగర్ లోని విద్యార్థి ఇంటికి వెళ్లి మరి సీనియర్స్ దాడి చేశారు. దీంతో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ గ్యాంగ్ వార్ లో ఓ విద్యార్థికి చేయి విరిగగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. అయితే, ఈ గొడవపై పోలీసులకు కాలనీ వాసులు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణకు కారణమైన వారిని పట్టుకుని సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లారు. ఇక, సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌ను నిరోధించడానికి కాలేజీ యాజమాన్యం యాంటీ-ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో పాటు పోలీసులు కూడా ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

# మహానగరంగా ఇక హైదరాబాద్

- 27 మున్సిపాటలిటీల విలీనం
- మున్సిపల్ రికార్డులను స్వాధీనం
- సిబ్బంది వివరాలు తెలియచేయాలని సూచనలు
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఆదేశాలు జారీ



**హైదరాబాద్, డిసెంబరు3:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 27 మున్సిపాలిటీల విలీనం ప్రక్రియ వేగవంతం అయింది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రత్యేక ఆదేశాలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రికార్డ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా రికార్డ్స్ ప్రొఫార్మ రూపొందించాలని తెలిపారు. ఇక, 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ లో విలీనం అయ్యే 27 మున్సిపాలిటీలలో ఉన్న సిబ్బంది వివరాలను తక్షణమే అందించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా లేఖ రాశారు. జీహెచ్‌ఎంసీలో మున్సిపాలిటీల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అత్యవసరంగా ఈ డేటాను కోరినట్లు కమిషనర్ లేఖలో స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా విస్తరణకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి నుంచి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ జీహెచ్‌ఎంసీ పరిధిలో భాగం కానుంది. ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జీహెచ్‌ఎంసీని ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితా విడుదల చేస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.



## సంపాదకీయం

# ఎన్నికల సంస్కరణలపై చర్చించే దమ్ముందా?

పార్లమెంట్ బృహత్తర బాధ్యతను నిర్వహించాల్సిన సమయం వచ్చింది. సమగ్ర ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. దీనిపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలి. అప్పుడే ఎన్నికల సంస్కరలప చర్చకు అర్థం ఉంటుంది. రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్న వారు అప్పుడు రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘంపై విమర్శలు చేయకుండా చూడాలి. అలా చేస్తే శిక్షార్హులు అయ్యేలా చేయగలగాలి. సర్‌పై చర్చకు అనుమతించినందున పార్లమెంటులో ఈ అంశాలన్నీ చర్చించాలి. అనేకానేక అంశాలు చర్చ చేయాలి. దేశానికి గుదిబండగా మారిన గవర్నర్ వ్యవస్థ, మండలి వ్యవస్థ, ఒకే వ్యక్తి వరుసగా చట్టసభలకు ఎన్నికవ్వడం, డబుల్ పెన్షన్లు పొందడం వంటివన్నీ ఈ ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో భాగం కావాలి. అప్పుడే ప్రభుత్వ చిత్తశుద్ధి కూడా బయట పడుతుంది. అలాగే విపక్షాల నిజాయితీ కూడా ప్రజలకు తెలుస్తుంది. ఎన్నికల సంస్కరణలపై తూతూ మంత్రంగా చర్చించకుండా ఈ అంశాలను చర్చించాలి. విపక్షాల సూచనలనలు పరిగణించాలి. అంతా కలసి సమగ్ర ఎన్నికల విధానం రూపొందించాలి. అలాగే ఇటీవల పదవీ విరమణ చేస్తూ..సుప్రీం ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను కూడా చర్చించాలి.ఎస్సీల్లో క్రిమిలేయర్ వర్తింప చేయాలన్న సూచనలు సభముందు చర్చించాలి. ఇకపోతే... ఇంతగా టెక్నాలజీ పెరిగినా..దానిని కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించుకోవడం లేదేమో అని అనిపిస్తోంది. ఓటర్ల జాబితా మొదలు, ఓటరు నమోదు ప్రక్రియన సులువుగా చేయడం, లేని ఓట్లను తొలగించడం అన్నది సులువుగా జరగాలి. కానీ అలా జరగడం లేదనడానికి సర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తున్నాయి. ఇటీవల ఉడాయ్ 2కోట్ల ఆధార్ కార్డులన నంబర్లను తొలగించింది. ఎక్కడా గందరగోళ రాలేదు. కాన ఓటు వషయంలో మాత్రం గందరగోళం ఏర్పడుతోంది. పక్కాగా ఓటు నమోదు, జాబితా రూపకల్పన, ఓటు అడ్రస్ మార్చుకోవడం అన్నది కంప్యూటర్ ముందు కూర్చుంటే అయిపోవాలి. నకిలీ ఓటు నమోదయితే కఠిన శిక్షలు అమలు కావాలి. మనదేశంలో తప్పులకు కఠిన శిక్షలు లేకపోవడం వల్లనే నేరాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహాలో ఆలోచన చేయాలి. ఓటును ఆధార్‌తో అనుసంధానం చేయడమే గాకుండా పక్కా ఓటరు కార్డు, జాబితాను రూపొందించాలి. సర్ లాంటి ప్రక్రియను ప్రతి ఎన్నికలకు ముందు జరపాలి. దొంగ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను నిరంతరం తొలగించేలా వ్యవస్థను రూపొందించాలి. ఇకపోతే భారత ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్, దాని అమలు విధానం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు రాకుండా పక్కాగా లక్ష్యాలను నిర్దేశించేలా పార్లమెంట్ చట్టాలను ఆమోదించాలి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తోపాటు గుజరాత్‌లో సర్‌పై వివాదాలు రాకుండా చేయగలగాలి. ఇకపోతే బిఎల్ఓల మృతి వార్తలను దీనికి ఆపాదిస్తూ అసలు వ్యవస్థ పనిచేయకుండా చేయాలన్న మమతా బెనర్జీ లాంటి వారికి గట్టిగా సమాధానం చెప్పాలి. బీహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ పక్రియ రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారించింది. ఇసి నుంచి వివరాలు తీసుకుంది. అయినా వివాదాలు సృష్టించేందకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదు. ఇది రాజ్యాంగ విధులను అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. ఓటర్లు బూత్ లెవల్ అధికారుల ద్వారా అందజేయ బడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి, తమ వివరాలను 2002-2005 నాటి ఓటర్ల జాబితాలతో సరిపోల్చాలి. 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని ఇసిఐ చెబుతున్నది. నిజమైన ఓటర్లు నింపాదిగా ఉండవచ్చు. వచ్చే నెలలో విడుదల కాబోయే ముసాయిదా జాబితాల్లో నమోదుకి అవసరమైన పత్రాలపై కూడా గందరగోళం లేకుండా చూడాలి. ఇంటింటికీ వెళ్లాలని చెప్పిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్తాయిలో బిఎల్‌వోలు పనిచేయాలి. పక్కాగా సమాచారం సేకరించాలి. ప్రతి ఓటరూ పాత రికార్డులు లేదా ఇసిఐ పేర్కొన్న పత్రాల ఆధారంగా తన చెల్లుబాటు నిరూపించాలి. సవరించిన జాబితాల్లో తప్పుడు నమోదు సమస్యలను కూడా పరిశీలించడం ద్వారా ఎక్కడా ఎలాంటి అపోహలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సార్వత్రిక వయోజన ఓటుహక్కును పరిరక్షించేందుకు, సాంకేతిక ఆధారిత డీ డూప్లికేషన్ తోపాటు, మరింత ఓర్పుతో ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ చేసే పద్ధతిని ఇసిఐ ఎంచుకోవాలి. ప్రధానంగా టెక్నాలిజితీ నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చు. ఎఐ వినియోగం పెంచుకోవాలి. వయోజనులందరికీ ఓటుహక్కు పరిరక్షణ కంటే మరో ధర్మం ఉండరాదు. ఎన్నో సంవత్సరాలుగా ఓటర్ల జాబితాల్లో ఉన్న పౌరులు తమ అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. ఖచ్చితమైన నమోదు బాధ్యతను కేంద్ర ఎన్నికల సంఘం పాటించాలి. అంతేగాక గందరగోళానికి దారితీసేలా చర్యలు ఉండరాదు. ఈ క్రమంలో కేంద్రం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఓటరు నమోదు అన్నది వ్యవస్థీకృతం కావాలి. పక్కాగా ఓటు నమోదు సాగాలి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో ఇలాంటి అంశాలను అన్నింటినీ చర్చించాలి. విపక్షాల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. దేశం అభివృద్ధి చెందాలంటే పక్కా ఓటు నమోదు వ్యవహారం ఉండాలి. లోటుపాట్లను చర్చించి సమగ్ర విధానంతో ముందుకు సాగేలా సవరణలకు వెనకాడరాదు.




# అడ్డూ అదుపులేని వెండి ధరలు

- వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్
- రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక




**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** వెండిధరలు అదరగొడుతున్నాయి. బంగారంతో నాకేంటి పోటీ అన్నట్లుగా అమాంతంగా పెరుగుతున్నాయి. పెరగడమే తప్ప తగ్గడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే అంతా అబ్బో అనుకున్నారు. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ. 1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ. 1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. వెండి అత్యధికంగా రూ. 3,126 పెరిగి రూ. 1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ. 1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ. 1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.

# లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఎంపీల ఆందోళన




**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా బుధవారం ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్‌కి నో? కార్మిక న్యాయానికి ఎస్' అని రాసిన బ్యానర్లు పట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. కాగా, పార్లమెంటు సమావేశాల రెండో రోజు కూడా ఎస్ఐఆర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో.. కేంద్ర ప్రభుత్వం దీనిపై డిసెంబర్ 9న చర్చించేందుకు ఆమోదించింది. డిసెంబర్ 1 నుంచి 19 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి.

# డాలర్ దెబ్బకు విలవిల

### మరింత క్షీణించిన రూపాయి విలువ

### చరిత్రలో తొలిసారి రూ.90 దాటిన డాలర్



**ముంబై, డిసెంబర్ 3:** యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో, సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది. 2025 జనవరి మధ్య నాటికి, రూ. 86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ. 87.25కి చేరుకుంది. సెప్టెంబర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ. 88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ. 89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలను చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ. 89.26- రూ. 89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

# ఢిల్లీ మున్సిపల్ ఉప ఎన్నికల్లో బీజేపీ సత్తా

### 12 స్థానాల్లో 7 గెలుపు.. ఆప్‌కు 3 సీట్లు ● కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెరో సీటు

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పైచేయి సాధించింది. 12 స్థానాల్లో 7 స్థానాలు గెలుచుకుంది. ఫిబ్రవరి అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన గెలుపును పదిలం చేసుకుంది. దశాబ్దానికి పైగా అధికారంలో కొనసాగి పది నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ 3 సీట్లు గెలుచుకుని రెండో స్థానానికి పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ ఒక సీటును దక్కించుకోగా, మరో సీటును ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఎంసీడీ ఉప ఎన్నికల్లో బీజేపీ ఏడు సీట్లు దక్కించుకున్నప్పటికీ మొత్తం 12 సీట్లలో ఇంతకుముందు 9 సీట్లు బీజేపీవే. ఇప్పుడు కోల్పోయిన రెండు సీట్లలో ఒక సీటు కాంగ్రెస్, మరొకటి ఏఐఎఫ్‌బీ చేజిక్కించుకున్నాయి. 2022లో జరిగిన పూర్తిస్థాయి ఎన్నికల్లో ఆప్ గెలుచుకున్న చాందినీచౌక్‌ను ఇప్పుడు బీజేపీకి చెందిన సుమన్ గుప్తా గెలుచుకోవడం ఆ పార్టీకి సానుకూల పరిణామం. 2022లో గెలుచుకున్న నరైన వార్డును తిరిగి ఆప్ నిలబెట్టుకుంది. బీజేపీ రెండు సీట్లు కోల్పోయినప్పటికీ ఎంసీడీలో ఆ పార్టీ ఆధిపత్యానికి ఢోకా లేదనే చెప్పాలి. మొత్తం 250 సీట్లలో బీజేపీకి ప్రస్తుతం 122 సీట్లు ఉండగా, ఆప్ 102 స్థానాలు కలిగి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత ఎంసీడీ ఉప ఎన్నికలు రావడంతో ముఖ్యమంత్రి రేఖాగుప్తాకు ఇది పరీక్షగా అందరూ భావించారు. అయితే ఆమె సునాయాసంగా పరీక్షలో నెగ్గారు. ఆప్ ఢిల్లీ యూనిట్ బాధ్యతలు తీసుకున్న సౌరభ్ భరద్వాజ్‌కు కూడా ఇది తొలి ఎన్నికలే అయినప్పటికీ ఆయన కూడా ఎలాంటి సీటు కోల్పోకుండా ఎన్నికలను గట్టెక్కించారని చెప్పవచ్చు. గ్రేటర్ కైలాశ్, షాలిమార్ బాగ్ బి, అశోక్ విహార్, చాందినీ చౌక్, చాందినీ మహల్, డిచావున్ కలాన్, నరైన, సంగమ్ విహార్ ఏ, దక్షిణ్ పురి, ముండ్కా, వినోద్ నగర్, ద్వారకా బి వార్డుల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. వార్డు కౌన్సిలర్లు అసెంబ్లీకి ఎన్నిక కావడంతో 11 వార్డులకు ఖాళీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ సంగమ్ విహార్-ఏలో మాత్రమే గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి సురేష్ చౌదరికి 12,766 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థికి 3,628 ఓట్లు వచ్చాయి. చాందినీ మహల్ వార్డును ఎఐఎఫ్‌బీ అభ్యర్థి మహమ్మద్ ఇమ్రాన్ గెలుచుకున్నారు. దక్షిణపురి,ముండ్కా, నరైనా వార్డులను ఆప్ గెలుచుకుంది. తక్కిన ఏడు వార్డుల్లోనే బీజేపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు.







# 13 మంది కుటుంబ సభ్యులను కాల్చివేత

### హంతకుడికి బహిరంగ మరణం

### బాలుడితో కాల్చి చంపించిన అఫ్టాన్ పోలీసులు

**కాబూల్, డిసెంబర్ 3:** తాలిబాన్ పాలిత అఫ్ఘానిస్తాన్‌లోని కోస్ట్ ప్రాంతంలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒక హంతకుడికి బహిరంగ శిక్ష అమలు చేయడంలో షాకింగ్ పనిచేశారు ఆఫ్ఘాన్ పోలీసులు. ఒకే ఫ్యామిలీకి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడు మంగల్‌ను, 13 ఏళ్ల బాలుడు చేత కాల్చి చంపించారు. శిక్షను స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో 80 వేల మంది ప్రజల ముందు అమలు చేశారు. అఫ్ఘాన్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ 'ఖిసాస్' అంటే ప్రతీకార శిక్ష జరిగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, మంగల్ 10 నెలల క్రితం అలీ షిర్ టెరెజియో జిల్లాల్లో నివశించే అబ్దుల్ రహ్మాన్.. అతని కుటుంబంలోని 12 మందిని తుపాకీతో కాల్చి చంపాడు.ఈ హత్యలకు అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. శిక్ష అమలు సమయంలో తాలిబాన్ అధికారులు కుటుంబంలో బతికున్న బాలుడు అబ్దుల్ రహ్మాన్ మంగల్‌కు క్షమాభిక్ష పెడతావా అని అడిగారు.. కానీ బాలుడు నిరాకరించడంతో, అతనికి తుపాకీ ఇచ్చి మంగల్‌పై మూడు రౌండ్ల కాల్పులు జరిపించారు. ఈ సందర్భంగా స్టేడియం భిడ్డ 'అల్లాహు అక్బర్' నినాదాలతో దద్ధరిల్లింది. కోస్ట్ పోలీస్ ప్రతినిధి ఈ ఘటనను ధృవీకరించారు. తాలిబాన్ పాలితంలో షరియా చట్టం కింద ఇలాంటి బహిరంగ శిక్షలు పెరుగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ సమాజం ఈ శిక్షను 'అమానవీయమైనది, అత్యంత క్రూరమైనది' అని ఖండిస్తోంది.

# ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

### ఐదుగురు మావోలు..ఒక పోలీస్ మృతి

**బీజాపూర్,డిసెంబర్3:** అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్రహోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతతో దద్దరిల్లుతున్నాయి. బుధవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు, పోలీసుల డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మరణించినట్లు తెలిపారు. మరో జవాన్‌కి గాయాలయ్యాయని అన్నారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుండి మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రపోలీసుల్లోని రెండు విభాగాలైన డిస్ట్రిక్ట్ రిజర్వ్‌గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరియు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ కోబ్రా ( కమాండో బెటాలియన్ ఫర్ రిసోల్యూట్ యాక్షన్ ) ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆ అధికారి తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటివరకు 268మంది మావోయిస్టులు మరణించారు.

# రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

మొదటి పేజీ తరువాయి

సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపాం. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారకు కలుపుతాం. పెన్నా వరకూ తీసుకెళ్తాం. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నా. ఛార్జీలను పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఈ సదర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశు వులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ. వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ



పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. జఠిలమైన వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుసంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయాలని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థితుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం. ప్రతీ ఎకరానికి నీరు అందేలా చేస్తాం. ఏపీలో తాగడానికి, వ్యవసాయానికి, పారిశ్రామికరంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంతరి అచ్చన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

**విజయవాడ :** ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఇకపై దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తరఫున సీఎం.. 7 వరాలు ప్రకటించారు. స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామని తెలిపారు. ఆర్థిక సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించినట్టుగానే దివ్యాంగులకు మళ్లీ ప్రారంభిస్తామని అన్నారు. శాప్ ద్వారా అన్ని క్రీడా కార్యక్రమాలు, టాలెంట్ డెవలప్‌మెంట్ స్కీములు దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. దేశంలో ఎక్కడా కూడా పింఛన్లకు రూ.6 వేలు ఇచ్చే ప్రభుత్వం లేదని.. ఒక్క ఏపీలో మాత్రమే ఉందని చంద్రబాబు నాయుడు అన్నారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.6వేలకు పెంచామని గుర్తుచేశారు. 63లక్షల 50వేల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే ఇళ్లకు వెళ్లి పెన్షన్ ఇస్తున్నామని వివరించారు. దివ్యాంగులపై తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్‌మెంట్ ఇదని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు కాబట్టే... అనేక రంగాల్లో రాణిస్తున్నారని చెప్పుకొచ్చారు.బహుళ అంతస్తులు కలిగిన ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టుల్లో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ కేటాయిస్తామని వెల్లడించారు. బాపట్లలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజీతో పాటు వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్‌లో చదివే దివ్యాంగ విద్యార్థులకు అదే చోట సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమరావతిలో 'దివ్యాంగ్ భవన్' ఏర్పాటు చేస్తామన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు.

'ఏడాదికి రూ.6వేలకోట్లు పెన్షన్ రూపంలో అందిస్తున్నాం. బ్యాక్ లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ పొడిగిస్తున్నాం.ఎన్ని అడ్డంకులు ఉన్నా వైకల్యం అడ్డుకాదని ఇక్కడ ఉన్న కొంతమంది నిరూపించారు. అలాంటి ఆదర్శవంతులను అభినందించాలి. ఆశీర్వదించాలి. దృష్టి లోపం ఉన్నా కరుణా కుమారి పట్టుదలతో రాణించి అవార్డు సాధించారు. అంతర్జాతీయ ప్రపంచ కప్ క్రికెట్ 42 పరుగులు సాధించి భారత్‌కు కప్ అందించింది. ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివి ఈ స్థాయికి చేరిందంటే నేను గర్విస్తున్నా. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని స్ఫూర్తి పొందాలి. అజయ్ కుమార్ రెడ్డి అర్జున అవార్డు సాధించడం గొప్ప విషయం. కర్ణాటక తరపున ఆడిన దీపిక మన రాష్ట్రంలో పుట్టారు. కంటి చూపు పోయినా అధైర్య పడకుండా క్రికెట్‌లో, వంద మీటర్ల పరుగులో రాణించారు.నేడు మెగాడీఎస్సీ ద్వారా 2వేలకు పైగా పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా బస్సు ప్రయాణం సదుపాయం కల్పిస్తున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'విశాఖపట్నంలో నేషనల్ సెంటర్ పర్ డిజేబుల్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. కరుణ కుమారికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరపున రూ. 5లక్షలు, మరో రూ. 5 లక్షలు, అంధుల క్రికెట్ అసియేషన్ ఒక లక్షతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.15లక్షలు, ఇళ్లు కట్టిస్తున్నాం. అజయ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం తరపున రూ.2 లక్షలు, ఎసీఏ తరపున లక్ష ఇస్తున్నాం. దీపికకు రూ.10 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. ఇంద్రధనస్సు రంగుల్లా మీ జీవితాలు బాగుండాలని, ఏడు వరాలు ఇస్తున్నాం. దివ్యాంగులు అందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో గెలుస్తారు.. ఓటమి చెందితే.. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రాధాన్యత ఇస్తాం.ప్రజాసేవకు దివ్యాంగులు అన్ని విధాలా సమర్థులని చెప్పేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఇచ్చేలా దివ్యాంగులకు కూడా రూ.19 కోట్లు కేటాయించి రుణాలు ఇస్తాం. క్రీడల్లో రాణించేలా అన్ని విధాలా ప్రోత్సహిస్తాం. టిడ్కో ఇళ్లు ఎక్కడ ఇచ్చినా.. గ్రౌండ్ ఎ÷-లోర్‌లో ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. వినికిడి లోపం ఉన్న వారికి ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తాం. రెసిడెన్షియల్ విద్యార్థులు ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చి పెన్షన్ ఇచ్చే ఏర్పాటు చేస్తాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతితో సహా అన్ని జిల్లాల్లో విభిన్న ప్రతిభావంతుల కోసం ఒక భవనం ఏర్పాటు చేస్తాం. విభిన్న ప్రతిభావంతుల భవన్‌లో మీరు కార్యక్రమాలు చేసుకోవచ్చు. ప్రజా రాజధాని అమరావతిలో స్వేచ్ఛగా తిరిగేలా ఏర్పాట్లు చేస్తాం. మీకు అండగా, తోడుగా నేను ఉంటా.. మిమ్మలను ముందుకు నడిపిస్తా. ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లండి.. మిమ్మలను ఆదుకునే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుంది.

ఎంత బిజీగా ఉన్నా మీతో మమేకం అయ్యి, మీకు ధైర్యం చెప్పాలనే ఉద్దేశంతోనే ఈకార్యక్రమానికి వచ్చాను. 2019 నుంచ 2024 మధ్య ఎప్పుడైనా ఇలాంటి కార్యక్రమాలు చూశారా.. దివ్యాంగులకు సభ పెట్టారా అని అడుగుతున్నా. ఒక్క రూపాయి అయినా మీకు సాయం చేశారా ఆలోచన చేయండి. దివ్యాంగులపై కక్ష కట్టి దాడులు చేశారు తప్ప.. మిమ్మలను ఆదుకోలేదు. నేను మీకు అండగా ఉంటాను.. తప్పకుండా మీకు ప్రభుత్వం అన్ని విధాలా చేయూతను ఇస్తుంది' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.కార్యక్రమంలో సీఎంతో పాటు మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, పెద్దఎత్తున విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మొదటి పేజీ తరువాయి



జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు పవన్ కల్యాణ్. మిగిలిన పదవుల భర్తీపై పలు సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతోపాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పార్టీ కమిటీల నియామకంపై పవన్ పలు సూచనలు ఇచ్చారు. పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు అయిదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది.. ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలి. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలి. ఈ విభాగంలో 11 మంది వరకు సభ్యులను నియమించాలి. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధినేత పవన్ దిశానిర్దేశర చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. అయిదుగురు సభ్యులు ఉండే కమిటీలో తప్పనిసరిగా ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలి.. 11మంది సభ్యులు ఉండే కమిటీ ముగ్గురు వీర మహిళలకు స్థానం ఇస్తూ కమిటీలు ఉండాలని నిర్ణయించారు.

# పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం

మొదటి పేజీ తరువాయి

మండలం కొత్తూరుకు చెందిన మరో వృద్ధురాలు సాలమ్మ కూడా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చనిపోయిన జ్యోతి, నాగమ్మల శాంపిల్స్ ను టెస్టుల కోసం ముంబై పంపించారు. పరీక్షల్లో స్క్రబ్ టైఫస్‌తో మృతిచెందినట్లు రిపోర్టుల్లో తేలినట్లు ప్రచారం జరుగుతుంది. దీని గురించి స్పష్టత రావాల్సి ఉంది. స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి వైద్యులు పలు వివరాలు తెలిపారు. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రాసుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమునాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తామని వైద్యులు తెలిపారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు. తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

# వివేకా హత్యపై సీబీఐ కోర్టులో సునీత కేసు

మొదటి పేజీ తరువాయి

బుధవారం న్యాయస్థానం విచారణ చేసింది. ఈ క్రమంలో సునీత వేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తి అవడంతో తీర్పును రిజర్వ్ చేసింది సీబీఐ కోర్టు. ఈ నెల 10వ తేదీన తీర్పు వెల్లడించనుంది సీబీఐ కోర్టు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు జరిపించేలా సీబీఐకు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలంటూ సునీత న్యాయవాదులు వాదనలు వినిపించారు. తన తండ్రి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపకపోతే అసలైన వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు సునీత. ఇదే కేసులో సప్లమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా సీబీఐకి ఆదేశాలు ఇవ్వాలని సీబీఐ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు సునీత తరుపు న్యాయవాది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపితే ఇప్పటివరకు వెలుగు చూడని సంచలన విషయాలు బయటకు వస్తాయని అభిప్రాయపడ్డారు సునీతారెడ్డి.

# ఏపీకి నక్షా కింద రూ.125 కోట్లు మంజూరు

## కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



**అమరావతి :** కేంద్ర ప్రభుత్వం ఏపీకి నక్షా కింద రూ.125 కోట్లు మంజూరు చేసిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నక్షా కార్యక్రమం కింద పట్టణ భూసమీకరణ వ్యవస్థను ఆధునికీకరించడంలో చూపిన ప్రగతికి కేంద్రం ఈమేరకు నిధులు మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. 10 పట్టణ స్థానిక సంస్థల్లో చూపిన విశేష పురోగతికి గుర్తింపుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ విషయాన్ని 'ఎక్స్' ద్వారా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రధాని మోదీ దూరదృష్టి, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో పాలనను మరింత బలపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పెమ్మసాని అన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు ప్రాపర్టీ కార్డులు జారీచేసే నక్ష ప్రాజెక్టుకు రాష్ట్రంలో పది పుర, నగరపాలక సంస్థలను కేంద్రం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది. 2026 మార్చి నెలాఖరులోగా ప్రాజెక్టు పూర్తిచేసి ప్రజలకు కార్డులు ఇస్తారు. రెండోదశలో మరికొన్ని పట్టణాలు ఎంపికయ్యే అవకాశాలున్నాయి. నగరాలు, పట్టణాల్లో భూములు, స్థలాలపై కచ్చితమైన రికార్డుల తయారీ, ఉన్న రికార్డుల నవీకరణ ద్వారా వివాదాలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో జాతీయ జియో స్పేషియల్ పరిజ్ఞానం ఆధారంగా పట్టణ ఆవాసాల్లో భూ సర్వే (నక్ష) పేరుతో కేంద్రం ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ ఏడాది ప్రారంభించింది. పైలట్ ప్రాజెక్టు అమలు కోసం దేశవ్యాప్తంగా 152 పట్టణ స్థానిక సంస్థలను ఎంపికచేసి రూ.194 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, ఏలూరు, తిరుపతి, మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థలతోపాటు కుప్పం పురపాలక సంఘాన్ని తొలి విడతలో కేంద్రం ఎంపిక చేసింది.

# అమరావతిలో పచ్చదానికి పెద్దపీట

## మీడియా సమావేశంలో మంత్రి నారాయణ

**అమరావతి :** రాజధాని అమరావతిలో 30 శాతం గ్రీనరీకి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. పచ్చదనంతో కూడిన రాజధాని నిర్మాణం మా లక్ష్యం అన్నారు. అందుకే గ్రీన్ బెల్ట్‌కు అధికంగా ప్రాధాన్యం కల్పిస్తున్నామిన చెప్పారు. 133.3 కి.మీ పరిధిలో ప్లాంటేషన్ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వివరించారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాజధాని పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండలో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్‌కు ప్రణాళిక రూపొందించాం. జనవరి నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేస్తాం. సీజన్‌లో వచ్చే ఫ్లవర్స్ ప్రకారం బ్యూటిఫికేషన్ ఉంటుంది. 22 రోడ్లలో రెండువైపులా బఫర్ జోన్‌లో గ్రీనరీ అభివృద్ధి జరుగుతుంది. రాజధాని రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 29 గ్రామాల పరిధిలో భూసమీకరణకు రైతులకు ఇవాల్టికీ విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులు ముందుకు రాకుంటే భూసేకరణకు వెళ్తాం. సీఆర్డీఏ కార్యాలయంలోనే రైతుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం అని నారాయణ తెలిపారు.

# అమరావతి పేరుతో రియల్ వ్యాపారం

### తొలివిడత భూములతో రాజధాని ఎక్కడ

### అప్పడే రెండో విడతలో భూసేకరణ ఎవరి కోసం

### చంద్రబాబు తీరుపై మండిపడ్డ పిసిసి చీఫ్ షర్మిల




**విజయవాడ :** మింగ మెతుకు లేదు..మీసాలకు సంపెంగ నూనెలా ఉంది ముఖ్యమంత్రి చంద్రబాబు గారి తీరు అని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. తొలి విడత సేకరించిన 54 వేల ఎకరాల్లో వరల్డ్ క్లాస్ నగరం అమరావతి ఎక్కడ అన్నారు. ఐకానిక్ సముదాయాల నిర్మాణాలేవి? రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో 29 వేల మంది రైతులకు ఇచ్చిన హామీల సంగతేంటని ప్రశ్నించారు. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక్క కిలోమీటర్ అయినా నిర్మాణం జరిగిందా అన్నారు. కళ్ళముందు సింగపూర్, జపాన్, ఢిల్లీ నగరాలు కనిపిస్తున్నట్లు, అమరావతి విశ్వనగరంలో ఇక భూములు లేనట్లు అప్పుడే రెండో విడత 16 వేల ఎకరాల భూ సేకరణ మొదలు పెడతారా ? ఇది రియల్ ఎస్టేట్ మాఫియా కాకుంటే మరేంటని నిలదీసారు. అదానీ,అంబానీ కి బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా అని నిలదీసారు. ముంబాయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాలు.. భోగాపురం 2200 ఎకరాలు. మరి అమరావతికి 5 వేల ఎకరాలు ఎందుకని అన్నారు. బీజింగ్,లండన్ లలో ఒలంపిక్స్ నిర్వహించే స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల విస్తీర్ణమే. మరి అమరావతి స్పోర్ట్స్ సిటీకి 2500 ఎకరాలు ఎందుకు ? గడిచిన 11 ఏళ్లలో ఒక్క పరిశ్రమ రాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీల కోసం భూములు అంటే నమ్మశక్యమేనా ? రాజధాని భూములపై వెంటనే శ్వేతపత్రం ఇవ్వాలి. ఇది భూములు ఇచ్చిన 29 వేల మంది రైతులను మోసం చేయడమే. రెండో విడత భూ సేకరణను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. రాజధానికి లక్ష కోట్ల అప్పులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అమరావతి నిర్మాణం కేంద్రం భాధ్యత. రాజధాని విభజన హామీ. స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి గారు రాష్ట్రానికి వస్తే, రాజధానికి సహాయం అడగాల్సిన పేరు శాలువాలు కప్పి, ఆహా ఓహో అని డప్పు కొడతారా ? అమరావతి పేరుతో చేసే అప్పులు జీవితాలలో తీరేవేనా అని సూటిగా ప్రశ్నించారు.

## సికింద్రాబాద్ AOC సెంటర్‌లో అగ్నివీర్ బ్యాచ్ 06/25 పాసింగ్ అవుట్ పరేడ్



**సికింద్రాబాద్ డిసెంబర్3( సమయం న్యూస్).:** సికింద్రాబాద్, బుధవారం: ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్‌లో అగ్నివీర్ బ్యాచ్ 06/25 యొక్క ప్రతిష్టాత్మక పాసింగ్ అవుట్ పరేడ్ అంగరంగ వైభవంగా జరిగింది. మొత్తం 478 మంది అగ్నివీర్లు మే 1 నుంచి ప్రారంభమైన 31 వారాల ప్రాథమిక మరియు పురోగతి సైనిక శిక్షణను విజయవంతంగా పూర్తిచేశారు. రక్షణ మంత్రిత్వ శాఖ 2022 జూన్‌లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీమ్ కింద వీరు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమం RU పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించబడగా, అగ్నివీర్లు తమ అద్భుతమైన మార్చ్ పాస్ నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం సైన్యంలో విభాగంలో అధికారికంగా చేరేందుకు ప్రమాణ స్వీకారం చేశారు. తీవ్రమైన శారీరక దృఢత, క్రమశిక్షణ, సహనం వంటి అంశాలపై రూపొందించిన కఠినమైన శిక్షణను సమర్థవంతంగా పూర్తిచేసినట్లు ఈ పరేడ్ స్పష్టంచేసింది. పరేడ్‌ను ఎంటర్ ఆఫీషియేటింగ్ కమాండెంట్ కర్నల్ కె. శాజీ సమీక్షించారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన అగ్నివీర్లను ఆయన అభినందిస్తూ, కొత్తగా ప్రారంభమవుతున్న వారి సైనిక జీవితంలో ధైర్యం, సేవా భావం, క్రమశిక్షణ వంటి విలువలను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. అగ్నివీర్లను శిక్షణ ఇచ్చిన ఇన్‌స్ట్రక్టర్ల కృషిని ఆయన ప్రశంసించారు. తమ కుమారులను జాతీయ సేవ మార్గంలో నడిపించినందుకు తల్లిదండ్రులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. క్రమశిక్షణ, సేవాస్ఫూర్తి, నిబద్ధత కలిగిన సైనికులుగా తయారైన అగ్నివీర్లు ఇప్పుడు దేశ సేవలో తమ ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు.

## ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలి

- గుత్పలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్, డిసెంబర్ 03 ( సమయం న్యూస్).** ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మాక్లూర్ మండలం గుత్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ఫారంలు, రిజిష్టర్లను పరిశీలించారు. మొదటి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్ల వివరాలను వెంటవెంటనే రోజు వారీగా ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.



వరంగల్. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వరంగల్ చౌరస్తాలో బిజెపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

## నగరా వాసులు పొడి, తడి చెత్త వేర్వేగా ఇవ్వండి



**వరంగల్ డిసెంబర్3( సమయం న్యూస్).:** చేయి చేయి కలుపుదాం – తడి పొడి చెత్త ను వేరు చేద్దాం స్వచ్ఛ వరంగల్ ను నిర్మిద్దాం" లక్ష్యం తో బుధవారం వరంగల్ పరిధి 42 వ డివిజన్ రంగశాయి పేట ,38 వ డివిజన్ ఖిలా వరంగల్ ప్రాంతాల్లో స్థానికులకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన ర్యాలీ లో పాల్గొని తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలని స్థానికులకు సూచించిన నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి కమిషనర్, చాహత్ బాజ్ పాయ్...... ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణ చందర్ బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఎం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి టి ఎం సి రమేష్ సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను ఆస్కి ప్రతినిధులు డా.రాజ్ మోహన్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# వేగంగా అభివృద్ధి పనులు

- బస్తీ బాటలో డిప్యూటీ మేయర్ హామీ.



**హైదరాబాద్, డిసెంబర్ 3( సమయం న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మోతే శోభన్ రెడ్డి తో కలిసి తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్ మరియు పార్థివాడ ప్రాంతాల్లో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, జలమండలి, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, ఆరోగ్య శాఖ, నగర పల్లె అభివృద్ధి విభాగాలు, పర్యావరణ శాఖ అధికారులతో పాటు అనేక మంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు ప్రతి బస్తీలో ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను సమగ్రంగా నమోదు చేశారు. బస్తీ బాట సందర్శనలో ప్రధానంగా రహదారుల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం, చెత్త వ్యవస్థలో లోపాలు, వీధిదీపాల పనితీరు, డ్రైనేజ్ బ్లాకేజీలు, నాళాల డీసిల్టింగ్, మంచినీటి సరఫరాలో అంతరాయాలు, కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ, పాఠశాలల చుట్టుపక్కల శుభ్రత, స్మశాన వాటిక అభివృద్ధి, బస్తీ దవాఖాన సేవల బలోపేతం వంటి పలువురు అత్యవసర సమస్యలు ప్రజల ద్వారా ప్రస్తావించబడ్డాయి. ప్రతి సమస్యపై అక్కడికక్కడే సంబంధిత అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా వినడం, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. బస్తీ బాట కార్యక్రమం కేవలం సమస్యలను వినడానికి మాత్రమే కాకుండా, బస్తీ అభివృద్ధిని సమగ్రంగా పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన ఒక ప్రజామిత్ర కార్యక్రమమని వివరించారు. జిహెచ్ఎంసి లోని పలు డివిజన్లలో ఈ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించబడిందని, ప్రజల నుండి వస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకుని దీనిని మరింత విస్తరించనున్నట్లు ఆమె చెప్పారు. బస్తీ అభివృద్ధి కోసం జిహెచ్ఎంసి కౌన్సిల్ సాంక్షన్ చేసిన రెండుకోట్ల నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఈ నిధులు పారదర్శకతతో పాటు అత్యవసర అవసరాలను బట్టి ఖర్చు చేయాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ముఖ్యంగా ఇంటీరియర్ రోడ్లు, కాలువలు, వీధిదీపాలు, వర్షాకాల డ్రైనేజ్ సమస్యలు, పార్కుల అభివృద్ధి, చిన్నారుల ఆట స్థలాలు, మహిళల కోసం రక్షిత ప్రదేశాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఆమె సూచించారు.

ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు జిహెచ్ఎంసి వ్యవస్థపై చూపుతున్న నిబద్ధతను డిప్యూటీ మేయర్ ప్రశంసిస్తూ, ఆయన బస్తీ స్థాయి నుండి నగర స్థాయి వరకు విస్తృతంగా పర్యవేక్షిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. అలాగే నగర ఇన్‌చార్జ్ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు కూడా హైదరాబాద్ అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి విభాగంతో సమన్వయం చేసి పనులు నిర్వహిస్తున్నారని ఆమె అభినందించారు. బస్తీ బాట కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరగా ఉండే పాలనను అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజలు అభినందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను నేరుగా డిప్యూటీ మేయర్‌తో పంచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ – ఇంత కాలం పెండింగ్‌లో ఉన్న పనులు ఈ కార్యక్రమం ద్వారా వేగంగా పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు, చెత్త సేకరణ, డ్రైనేజ్ క్లీరెన్స్, నాళాల శుభ్రత, రోడ్ల మరమ్మతులపై తక్షణ స్పందన వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ బస్తీ బాట కార్యక్రమం ద్వారా తార్నాక డివి జన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్, పార్థివాడ ప్రాంతాలు త్వరలోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలతో మమేకమై సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# భవిత కేంద్రాలతో దివ్యాంగుల మానసిక అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- భవిత కేంద్రం ప్రారంభం



**తిమ్మాపూర్ డిసెంబర్3( సమయం న్యూస్).:** భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగ పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని (ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల) జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక పద్ధతిలో విద్యా బోధన ద్వారా దివ్యాంగ విద్యార్థుల్లో ఎంతో మార్పు కనిపిస్తోందని తెలిపారు. చిన్న వయసులోనే భవిత కేంద్రంలో చేర్పిస్తే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రుల అవసరం లేకుండానే సొంతంగా వారి పనులు చేసుకునే స్థాయికి చేరుకోగలరని అన్నారు. జిల్లాలో "దివ్య దృష్టి" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాలను ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అక్కడ చదివే పిల్లల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అధికారులకు, పాఠశాలలు, ఆసుపత్రుల సిబ్బందికి సైగల భాష నేర్పడం ద్వారా బధిరుల భావాలను వారు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ప్రత్యేక విద్య బోధించే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దివ్యాంగుల కోసం జిల్లాలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దివ్యాంగుల పాఠశాలలు, భవిత కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. భవిష్యత్తులో దివ్యాంగ విద్యార్థుల చదువుకు, వారి అభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్ర, విద్యా శాఖ కో ఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ ఎంఈఓ శ్రీనివాస్, డిఈ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి పాల్గొనాలి మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్ర మాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించారు. కొందరు విద్యార్థులు పాఠాలు సరిగ్గా చదవకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పాఠాలు బిగ్గరగా చదవించాలని అన్నారు. బుధవారం భోదనలో ప్రతి విద్యార్థిని భాగస్వామ్యం చేయాలని, ప్రతి ఒక్కరితో పాఠాలు చదివించాలని ఆదేశించారు. విద్యా ర్థులు పట్టుదలతో నేర్చుకోవాలని, అర్థం కానీ సబ్జెక్ట్ ను ఉపాధ్యాయుల మరోసారి అడిగి తెలుసుకోవాలని తెలిపారు.

# మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

- గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం.





**నిర్మల్ డిసెంబర్3( సమయం న్యూస్).:** సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నిక విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని వివరించారు.

**పంచాయితీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**



పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా, ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఎన్నిక తర్వాత, ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలను పైఅధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ: 3 డిసెంబర్( సమయం న్యూస్).:** నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ల ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. హనుమకొండ జిల్లాలో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన దామెర క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దామెర, ల్యాదెళ్ళ గ్రామ పంచాయతీలకు, ఒగ్లాపూర్ క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఒగ్లా పూర్, దమ్మన్నపేట గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న ఎలక్షన్ నోటీస్, రిజర్వేషన్ల జాబితా లను పరిశీలించారు. ఆర్వోలు, ఏఆర్వోలతో నామినేషన్ల ప్రక్రియ గురించి కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాట్లను, నామినేషన్ల ప్రక్రియను ఎంపీడీవో కల్పన జిల్లా కలెక్టర్ కు వివరించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది, పోలీస్ భద్రత గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగానిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# చట్టాల పై అవగహన అవసరం

**నారాయణ పేట డిసెంబర్3( సమయం న్యూస్).:** వైకల్యం అనేది శరీరానికే గానీ మనసుకు కాదు, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారు జాతీయ న్యాయ సేవ సంస్థ ఆదేశాలకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంపై "రొనాల్డో మానశిక దివ్యంగుల ప్రత్యేక పాఠశాల" ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సును అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారు శ్రీ.కే.అవినాష్ గారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి గారు మాట్లాడుతూ చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహించబడుతుంది. మన సమాజంలో దివ్యాంగులకు ఎదురయ్యే సవాళ్లను, వైకల్యాలను మనం అర్థం చేసుకోని వారిని ప్రోత్సహించలి. వైకల్యాము అనేది శారీరక, మానసిక, అభిజ్ఞా, లేదా ఇంద్రియ సంబంధితమైనవి కావచ్చు. అయితే, వైకల్యాలని వారి జీవితాలకు, సామర్థ్యాలకు పరిమితం చేయకూడదు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగుల ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ప్రయత్నిస్తుంది, వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడం, వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరు సమాజ అభివృద్ధిలో భాగం అని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి తమ ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని, నాటు వైద్యం వద్దు ప్రభుత్వ వైద్యం ముద్దు, అని తెలిపారు. వైకల్యం అడ్డుకోని సామర్థ్యాలపై దృష్టి పెట్టండి మరియు అది జోక్యం చేసుకునే విషయాలపై దృష్టి పెట్టవద్దు. శారీరకంగా వికలాంగుడిగా ఉండండి, ఆత్మలో కాదు మానకున్న గొప్ప బలహీనత వదులుకోవడంలో ఉంది. విజయం సాధించడానికి ఖచ్చితమైన మార్గం ఎల్లప్పుడూ ప్రయత్నించాలి అని తెలిపారు. వికలాంగుల పట్ల గౌరవం, సానుభూతి మరియు అవగాహనతో వ్యవహరించాలి, వికలాంగులను ప్రోత్సహించేందుకు మనందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. వికలాంగులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి వారి జీవితాలను మెరుగుపరచాలి. వికలాంగులందరినీ సమాజంలో సమానంగా చూడాలి. వారిని ప్రోత్సహిద్దాం. వారికి అండగా ఉండాలి అని తెలిపారు. జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులని జడ్జిగారు అబినంచించారు. 15100 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయని పొందవచ్చు అని తెలిపారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ.కే.సురేష్ మరియు లీగల్ ఎయిడ్ కౌన్సెల్ శ్రీ.కే.లక్ష్మిపతి గౌడ్, డాక్టర్.బి.వెంకటయ్య గారు (డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్), మరియు శ్రీమతి.నగలష్మి గారు (పాఠశాల ప్రిన్సిపాల్), శ్రీ.డి.నర్సిములు గారు (డిస్ట్రిక్ట్ మిషన్ కోర్డినేటర్), శ్రీ.ఆంజనేయలు(ఏ.స్.ఐ) పారాలీగల్ వాలంటీర్లు, విద్యార్థులు, మరియు తల్లితండ్రులు పాల్గొన్నారు.



# అభ్యర్థులను నామినేషన్ ఉపసంహరణలో ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు గురి చేయరాదు.

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట డిసెంబర్3( సమయం న్యూస్).:** కలెక్టరెట్ కార్యాలయం లోని వి సి హాల్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫి రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కింద నిర్వహించనున్న 8 మండలాల్లోని గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నేటితో ఉపసంహారణ పూర్తి అవుతుందని పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని సూచించారు. సర్వీస్ ఓటర్లకు,ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సపోర్టింగ్ స్టాప్ కు, ఎన్నికలలో ఉపయోగించే వాహన డ్రైవర్లకు ఫారం 14 ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని,వారి ఓటు ఉన్న సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్ నందు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ పంపిణి ప్రక్రియ సాఫీగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతిరోజు ఉదయం స్ట్రాంగ్ రూమ్ నుండి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పోలీస్ స్ట్రాంగ్ రూమ్ నుండి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ కు పోలీస్ బందోబస్తు తో తీసుకెళ్లాలని అక్కడ గ్రామపంచాయతీల వారీగా బ్యాలెట్ బాక్స్ లను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని మౌళిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని మరలా సాయంత్రం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ కి పోలీస్ ఎస్కార్ట్ తో తరలించి భద్ర పర్చలని సూచించారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో రికార్డ్ చేయాలని అన్నారు



పోస్టల్ బ్యాలెట్ ఎలా ఉపయోగించాలో ఎంపీడీవో కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్ నందు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. మొదటి దశ లో జరిగే గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు నామినేషన్ల ఉపసంహరణ నేటి తో పూర్తవ్వడంతో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని పోటీ చేసే అభ్యర్థులు ఆరుగురు కంటే ఎక్కువగా ఉంటే బ్యాలెట్ పేపర్లు ప్రింట్ చేయాల్సింది కాబట్టి తగ్గిన ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారు అయిన తర్వాత అభ్యర్థులతో ఆర్ ఓ లు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి మార్గదర్శకాలు, ఎన్నికల ఖర్చుల నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మొదటి విడత, రెండో విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగిందని ఇలాగే అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. అంతకుముందు అవినీతి నిరోధక శాఖ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫి రెన్స్ లో ఎస్పి కే నరసింహ, అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జడ్పీ సి ఈ ఓ వివి అప్పారావు, డి పి ఓ యాదగిరి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీనివాస్,డి ఎల్ పి ఓ నారాయణ రెడ్డి, తదితరులు ఈ వీడియో కాన్ఫి రెన్స్ కు హాజరైనారు.

# వరి కొనుగోలు వేగవంతం చేయాలి

● జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్.



తాడ్వాయి మండలం కరడ్ పల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం తాడ్వాయి మండలంలోని కరడ్‌పల్లి వరి కొనుగోలు కేంద్రం ను సందర్శించారు. ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కొనుగోలు కేంద్రంలో వరి కొనుగోలు ప్రక్రియ, రైతుల రాకపోకలు, గన్నీస్ అందుబాటు, రవాణా సదుపాయాలు తదితర అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రవాణా కాంట్రాక్టర్ ద్వారా లోడింగ్ సక్రమంగా జరుగుతున్నదని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొనుగోలు కేంద్రంలో నిర్వహణ పద్ధతులను పరిశీలిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణం, పారదర్శకంగా కొనుగోళ్లు జరగాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తూకం, గన్నీస్ సరఫరా, ట్రక్కుల రాకపోకలు, మిల్లులకు రవాణా వంటి అంశాల్లో పూర్తి సమన్వయం ఉండాలని సూచించారు.త్వరితగతిన కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.అనంతరం ప్రజలు గ్రామం లో ఉన్న సమస్యలను జిల్లా పరిషత్ పాఠశాల సమీపం లో ఉన్న డంపింగ్ యార్డ్ ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అలాగే పాఠశాలలో త్రాగునీరు, టాయిలెట్స్ సమస్యల పై కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే తహసిల్దార్, సంబంధిత అధికారులకు ఆదేశాలు చేస్తూ ఇక్కడే ఉండి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు .కలెక్టర్ వెంట సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, %ఎఎ% శ్రీకాంత్, %ఎజూశీ%, తహసిల్దార్, రైతులు, తదితరులు ఉన్నారు.

# రైల్వేలు త్వరలో తాత్కాల్ విండో టికెట్లకు OTP వ్యవస్థ అమలు

**సికింద్రాబాద్ డిసెంబర్ 03( సమయం న్యూస్) :** సాధారణ ప్రయాణికులకు టాట్కల్ రిజర్వేషన్‌ను మరింత సులభతరం చేయడానికి రైల్వేలు ఆధారిత టాట్కల్ రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నాయి.ముందుగా, 2025 జులైలో రైల్వేలు ఆన్‌లైన్ టాట్కల్ టికెటింగ్‌లో ఆధార్ ఆధారిత ధృవీకరణను ప్రారంభించాయి. ఆపై, 2025 అక్టోబర్‌లో మొదటి రోజు బుకింగ్‌లకు సంబంధించి అన్ని సాధారణ రిజర్వేషన్‌ల కోసం ఆధారిత ఆన్‌లైన్ రిజర్వేషన్ వ్యవస్థను అమలు చేశాయి. ఈ రెండు చర్యలు ప్రయాణికులచే విస్తృతంగా వినియోగించబడుతూ, రిజర్వేషన్ వ్యవస్థలో పారదర్శకత మరియు సౌలభ్యాన్ని పెంచాయి.2025 నవంబర్ 17న రైల్వేలు రిజర్వేషన్ కౌంటర్ల వద్ద టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికుల కోసం ఆధారిత టాట్కల్ రిజర్వేషన్ వ్యవస్థను పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించాయి. ప్రస్తుతం ఈ వ్యవస్థను 52 రైళ్లకు విస్తరించారు. ఈ విధానంలో, టాట్కల్ టికెట్‌ను రిజర్వేషన్ కౌంటర్‌లో బుక్ చేసినప్పుడు, ప్రయాణికుడు రిజర్వేషన్ ఫారమ్‌లో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు అందుకుంటాడు. ధృవీకరణ అనంతరం మాత్రమే టికెట్ కన్ఫర్మ్ అవుతుంది.కొన్ని రోజుల్లోనే ఈ ఆధారిత టాట్కల్ రిజర్వేషన్ వ్యవస్థను మిగతా అన్ని రైళ్లకు కూడా రైల్వేలు అమలు చేయనున్నాయి. టాట్కల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టడం, నిజమైన ప్రయాణికులకు అధిక డిమాండ్ టికెట్లు పొందడానికి మెరుగైన అవకాశం కల్పించడం ఈ చర్య లక్ష్యం. రైల్వే టికెటింగ్‌లో పారదర్శకత, ప్రయాణికుల సౌలభ్యం, భద్రత పెంపు దిశగా ఇది ఒక కీలక ముందడుగు.

# భవిత సెంటర్ కు దివ్యాంగ విద్యార్థులు రెగ్యులర్ గా హాజరు కావాలి...

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**భవిత సెంటర్ లో విద్యార్థుల సంఖ్య పెంచాలి**

**నూతన భవిత సెంటర్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్**




**పెద్దపల్లి, డిసెంబర్-03( సమయం న్యూస్) :** భవిత సెంటర్ కు దివ్యాంగ విద్యార్థులు రెగ్యులర్ గా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ఆవరణలో నిర్మించిన నూతన భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ భవిత సెంటర్ లో రిజిస్టరైన విద్యార్థులు తప్పనిసరిగా సోమవారం నుంచి శుక్రవారం వరకు భవిత సెంటర్ కు రావాలని, వారం రోజులలో రెండు సార్లు విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం జరుగుతుందని, భవిత సెంటర్ లో దివ్యాంగ విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ సూచించారు.భవిత సెంటర్ లో చదివే దివ్యాంగ విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం 5 వేల రూపాయల స్కాలర్ షిప్ అందించడం జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్క దివ్యాంగ విద్యార్థులకు అందేలా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ , జిల్లా విద్యాశాఖ అధికారి శారద, ఎం.ఈ.ఓ సురేందర్ కుమార్ , ఎస్.ఓ కవిత, ఐ.ఆర్.పి లు సంధ్యా రాణి, రజిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పిహెచ్ఎస్ రాయపోల్ లో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు



**రాయపోల్, డిసెంబర్ 3:** ప్రపంచ దివ్యాంగుల ది నోత్సవాన్ని రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోబుదవారం ఘ నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి సత్యనా రాయ ణ రెడ్డి ముఖ్య అతి థిగా హాజ రయ్యారు. ఈ సంద ర్భంగా దివ్యాంగ విద్యార్థు ల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న %ఱతీఖఅంజూశీతీ- చాశ్రీశ్రీశీఝఅషెవ, జుంఎశీతీ చాశ్రీశ్రీశీఝఅషెవ, ూఅజూవఅస% వంటి సదు-పాయాలను ప్రత్యేక ఎడ్యుకేటర్లు వివరించారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ ఎడ్యుకేటర్స్ అనిల్ కుమార్,శిరీష పాఠశాల ఇన్చార్జి ప్రదానినోపాద్యాయులు నర్సింగరావు, దివ్యాంగుల విద్యార్థులు,వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అంగడిరైచుర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్నీ సందర్శించిన జిల్లా DM&HO (డాక్టర్) స్వర్ణ కుమారి.

### ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని వైద్యాధికారులకు తెలిపారు





**కొడంగల్ మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం లోని అంగడిరైచుర్ ప్రభుత్వ ఆసుపత్రిని వికారాబాద్ జిల్లా డీ ఎం % హెచ్ ఓ. డాక్టర్.స్వర్ణ కుమారి సందర్శించడం జరిగింది.అన్ని రికార్డ్స్ లను పరిశీలించి ప్రోగ్రామ్స్ 100% చేయాలన్నీ చెప్పడం జరిగింది,ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కాకుండా చూడాలన్నారు.ల్యాబ్, ఫార్మాసి అన్ని సేవలు అందించాలని చెప్పడం జరిగింది. జిల్లా డిప్యూటీ (Dy) DM&HO.డాక్టర్ రవీంద్రా యాదవ్, అంగడిరైచుర్ డాక్టర్ భూషరా ఫాతిమా, వైద్య సిబ్బంది ఉన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బోర్డర్ చెక్‌పోస్టులను ఆకస్మికంగా పరిశీలించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్):** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లా కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం రోజు ఆకస్మికంగా పలు చెక్‌పోస్టులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ నారాయణపేట మండలంలోని జలాల్పూర్ చెక్‌పోస్ట్ (కర్ణాటక బోర్డర్), దామరగిద్ద సమీపంలోని కాన్కుర్తి బోర్డర్ చెక్‌పోస్ట్ లను ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, ఎస్ఎస్‌టి టీమ్‌లను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఎన్నికల సందర్భంలో అక్రమ రవాణా, మద్యం, డబ్బు మరియు ఇతర విలువైన వస్తువుల ప్రవేశాన్ని నిరోధించేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచిస్తూ వాహనాల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలి అని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి అని అవసరమైతే వీడియో రికార్డింగ్‌తో తనిఖీలు కొనసాగించాలని ఎస్పీ తెలిపారు.జిల్లాలో పరిధిలో మొత్తం 06 బోర్డర్ చెక్‌పోస్టులు, 05 ఎస్ఎస్‌టి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. సరిహద్దు మార్గాలన్నింటి లోనూ మరియు గ్రామ పరిధిలోని మార్గాలను కూడా నిరంతరం నిఘా ఉంచి తనిఖీలు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగడానికి పోలీసు శాఖ పూర్తి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఎస్పీ తెలిపారు.

## దౌల్తాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా DM&HO డాక్టర్ స్వర్ణ కుమారి




**దౌల్తాబాద్ మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి డిప్యూటీ డీఎం హెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని దౌల్తాబాద్ వైద్యాధికారి అమూల్య ప్రియదర్శిని తెలిపారు.సూపర్ వైజర్ రఫీ,హెల్త్ అసిస్టెంట్ మధు,ఎల్ టి మహేష్ వున్నారు.

# సారా పాకలోప్రారంభమైన పంచాయితీ పోరు

- ప్రచార పర్వంలో చందు నాయక్ జోరు
- సమగ్రఅభివృద్ధి యే తన ధ్యేయం
- యువతకు మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం
- ఓటర్లకు హామీలు

( సమయం ఇంటర్వ్యూ లో ....)



**భద్రాద్రి కొత్తగూడెం ,డిసెంబర్ 3:(సమయం న్యూస్ ) :** ఐటీసీ వంటి అతిపెద్ద కంపెనీ గల పెద్ద గ్రామ పంచాయితీ సారా పాక లో సుమారు 8 సంవత్సరాల అనంతరం పంచాయతీ పోరు ప్రారంభమైంది. ఈ పంచాయతీ ఎన్నికల పోరులో మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా ధరావత్ చందు నాయక్ బరిలో దిగారు. గత రెండు దఫాలు సర్పంచ్ గా పనిచేసిన చందు నాయక్ ఈ ఎన్నికలో హ్యాట్రిక్ కొట్టేందుకు సన్నదంగా ప్రచార పర్వంలో తనదైన జోరుతో ముందుకు సాగుతున్నారు.సుమారు 8 సంవత్సరాల తరువాత పెద్ద పంచాయతీగా ఉన్నటువంటి సారపాక గ్రామ పంచాయతీలో స్థానిక ఎన్నికల ప్రక్రియ వాడీ వేడీగా ప్రారంభమైంది. ఈ క్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయం ప్రతినిధి యం డి . షఫీ యు జమ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో .... చందు నాయక్ పలు విశేషాలను వెల్లడించారు. కాగా , ఈ నేపథ్యంలో ఔత్సాహికులు పంచాయతీ బరిలో దిగి సర్పంచ్ గా తమ అదృష్టాన్ని పరీక్షించే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఈ ఎన్నికలలోయు-వత ఉత్సాహంతో పంచాయతీ పోరులో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో తమ తమ నామినేషన్లను దాఖలు చేశారు. పైగా గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేయడం విశేషం. కాగా ఇదే సమయంలో గత రెండు దఫాలుగా సారపాక సర్పంచ్ గా గెలుపొందిన ధరావత్ చందు నాయక్ మరో సారి స్వతంత్ర అభ్యర్థిగా పంచాయతీ బరిలో దిగి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. చందు నాయక్ సైతం తన గెలుపు పట్ల అమిత విశ్వాసంతో ఉన్నారు. తొలిసారిగా 1970వ దశకంలో ఏర్పడ్డ సారపాక పంచాయతీ తొలి సర్పంచ్ ప్రస్తుత అభ్యర్థి చందు నాయక్ తండ్రి రాజు నాయక్ కావడం గమనార్హం. ఆ నాడు 1200 వరకు ఓటర్లు ఉన్న సారపాక నేడు సుమారు 20 వేలకు చేరుకుంది. తండ్రి రాజు నాయక్ సుమారు 20 సంవత్సరాల వరకు ఏకదాటిగా సర్పంచ్ గా పని చేశారు. ఆ తరువాత రెండు దఫాలు సర్పంచ్ గా ఎన్నికైన చందు నాయక్ హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. సారపాక పంచాయతీ ఆదాయం 18 లక్షల వరకు ఉన్న సమయంలో తన ప్రాతినిధ్యం వల్ల సారపాకలో ఉన్న ఐటీసీ నుంచి పన్ను రూపేణ రాబట్టిన నిధులతో పంచాయతీ ఆదాయాన్ని ఒక కోటి యాబై లక్షల వరకు పెంచడం జరిగిందని ఈ సందర్భంగా చందు నాయక్ తాను ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీనితో పాటు సారపాకలో వాటర్ స్కీమ్స్, కల్యాణ మండపంతో పాటు 85 శాతం వరకు సీసీ రోడ్లు, అనేక డ్రైనేజీల నిర్మాణం, నర్సరీలు తన హయాంలోనే ఏర్పాటు చేశామని అన్నారు. తన తండ్రి రాజు నాయక్ హయాంలో సుమారు 4వేల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని అన్నారు. పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా తాను చేసిన సేవా కార్యక్రమాల ద్వారా సారపాకలోని ప్రతీ కుటుంబం లబ్ధిపొందిందని అన్నారు. కాబట్టి తన గెలుపునకు ఎలాంటి అవరోదాలు లేవని.., ప్రజలు మరోసారి తనను కోరుకుంటున్నారని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సారపాక పంచాయతీలో సెడ్యూల్ వర్గాలకు అతీతంగా ఇతరులు కూడా పోటీ చేసే ప్రయత్నాన్ని తాను అడ్డుకున్నాని ప్రకటించారు. ఫలితంగా సారపాక పంచాయతీ ప్రస్తుత ఎన్నికలలో ఎస్టీలకే అవకాశం దక్కిందని ఇది తన పోరాట ఘనతగా చెప్పారు. ఈ నేపథ్యంలోనే 8 సంవత్సరాల పాటు సారపాక పంచాయతీ ఎన్నికలు జరగలేదని అన్నారు. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా అరకొర నిధుల కేటాయింపు వల్లనే సారపాక సమగ్ర అభివృద్ధి జరగలేదని స్పష్టం చేశారు. అందుకే తనను మరో సారి ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తనకున్న ఇమేజ్ అభివృద్ధి ప్రధాత అని ఈ విషయం సారపాక లోని ప్రతీ ఒక్కరికి తెలిసిందేనని కాబట్టి కులమతాలకు అతీతంగా.., పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా తనకు ప్రతీ ఒక్కరు మద్దతు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యర్థులు ఎవరైనా తన గెలుపు తధ్యమని , తన విజ యంతో మోడల్ టౌన్ గా సారాపాక కొత్త హం గులను సంతరించుకుంటుందని దరావత్ చందు నాయక్ ప్రకటించారు.

# విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యం..

- మహిళల అండగా "షీ" టీమ్ పోలీసులు..
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**కోస్గి మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్):** కోస్గి మండల పరిధిలోని సర్జఖాన్ పేట్ జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ కొరకు పోలీసు చట్టాల గురించి, "షీ" టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, "షీ" టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి, ర్యాగింగ్, ఇవిటీజింగ్,పోక్సో, "షీ" టీమ్స్, యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి విద్యార్థులకు వివరించినట్లు ప్రధానోపాధ్యాయులు కృష్ణ గౌడ్ తెలిపారు.బుధవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మరియు మాటలు నమ్మవద్దు, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది అని మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని "షీ" టీమ్ పోలీసులు తెలిపారు.మహిళల భద్రత ,విద్యార్థినిలు చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు.ప్రతి ఒక్కరు చదువుపై దృష్టి సారించాలని, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని సూచించారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని మరియు సామాజిక రుగ్మతల గురించి ఫోన్ ల వినియోగానికి ఎంత దూరం ఉంటే అంత మంచిది సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉందని అన్నారు.ఫోన్లకు అలవాటు పడి బానిసలు కావద్దు విద్యార్థి దశ చాలా కీలక కష్టపడే తత్వం కష్టపడి చదువుకోవడం చాలా ముఖ్యమని మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మరియు అవహేళనగా మాట్లాడిన వెంటనే డయల్ 100 లేదా "షీ" టీమ్ నంబర్ 8712670398 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మరియు నూతన చట్టాల గురించి నూతన చట్టాలలో మహిళల రక్షణకు పెద్దపీట వేయడం జరిగిందని "షీ" టీమ్ పోలీసులు బాలరాజు, చెనప్ప, జ్యోతి, కవిత,అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం

### డివైడరును కారు ఢీకొని ముగ్గురు మృతి

### మరొకరి పరిస్థితి విషమం



**ఖమ్మం , డిసెంబర్ 3 : ( సమయం న్యూస్ ) :** సత్తుపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన విషాదాన్ని మిగిల్చింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పోలీసుల కథనం మేరకు ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద బుధవారం ఉదయం 5 గంటలకు జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెనుబల్లి నుంచి సత్తుపల్లి వైపు అతివేగంగా వచ్చిన కారు కిష్టారంలోని అంబేద్కర్ నగర్ కాలనీ వద్ద రాష్ట్రీయ రహదారిపై డివైడరును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ముగ్గురు మృత్యువాతకు గురయ్యారు. ఒకరి పరిస్థితి విషమంగా మారింది. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన సాదిక్ (21), సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన సిద్దేసి జాయ్ (21), మర్సకట్ల శశి వర్ధన్ (12) అక్కడికక్కడే మృతి చెందారు. అన్నపురెడ్డిపల్లికి చెందిన తలారి అజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. చండ్రుగొండ మండలం మహాబాద్ కాలనీకి చెందిన ఎస్కే ఇమ్రాన్ కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన అజయ్ ను, ఇమ్రాన్ ను మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. మృతి చెందిన ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి మార్చురీకి తరలించారు. డివైడరును ఢీకొట్టిన కారు నుజ్జునుజ్జయి శకలాలు 50 మీటర్ల దూరం వరకు చెల్లాచెదురుగా పడ్డాయి. ఏసీపీ వసుంధర యాదవ్, సీఐ తుమ్మలపల్లి శ్రీహరి, ఎస్ఐలు ప్రదీప్, అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఈ సంఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాద దృశ్యాన్ని వారంతా కంటతడి పెట్టారు. ప్రమాద విషయం తెలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా నాగమణి దయానంద్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద దృశ్యాన్ని పరిశీలించారు.

# శ్రీకాంతాచారి ఆత్మ హుతి తో ప్రజ్వలించిన తెలంగాణ

- రాష్ట్రం సాకారం అయినా కానరాని ఫలితాలు
- పాలకుల విధానాలే తెలంగాణ వినాశానికి కారణాలు
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య



**ఖమ్మం , డిసెంబర్ 3 : ( సమయం న్యూస్ ):** మలిదశ తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంత చారి ఆత్మహుతితో తెలంగాణ ఉద్యమం ప్రజ్వదించిన ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం కలసాకారం చెందిందని , పాలకులు విస్తరిస్తున్న విధానాలే మన తెలంగాణ వినాశానికి కారణాలు అవుతున్నాయని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య అన్నారు.తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శ్రీకాంత్ చారి వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం అమరవీరుల స్థూపం దగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతొలి మళ్ళి దశల త్యాగాలు బలిదానాల కారణంగానే మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తొలుత బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ద్రోహులకు అందలం దక్కిందని , తెలంగాణ ఉద్యమకారులకు తప్పనిసరిగా న్యాయం చేస్తానని ప్రకటి ంచిన సీ ఎం రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలు గడిచిపోతున్న దానిపై ఎలాంటి కార్యాచరణ ప్రకటించకపోవడం విచారకరన్నారు. శ్రీకాంతాచారి వంటి ఎందరోతెలంగాణఉద్యమకారుల కృషి ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు . ఇతర రాష్ట్రాలలో ఆయా రాష్ట్రాల సాధనకు పాటుపడ్డ వారిని వారు సన్మానించుకుని , తగినప్రాతినిధ్యం కల్పించారని పేర్కొన్నారు. మన పాలకులు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా లేనప్పుడు మరో విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కృషి చేస్తుందని , ఆ దిశగా నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ముందుకు పోతుందన్నారు. ఉద్యమకారులు అంతా సంఘటితంగా మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యమకారులతోపాటు త్యాగాలు బలి దానాలు చేసిన కుటుంబాల సభ్యులు ఇందుకుసన్నద్ధం గాఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోపాలకుర్తి కృష్ణ, జంపాని అంజయ్య, తునికిపాటి చారి, కుక్క సత్యం, వడిత్యా రాజేష్ నాయక్, ఉల్లోజు వెంకన్న, బొలికొండ పాపయ్య, కుర్రి ముత్తయ్య, ఎల్. రామస్వామి, సీతమ్మ, రామాంజనేయులు, మీగడ రామారావు, కాలింగ్ గురవయ్య, కూరపాటి కృష్ణమూర్తి, భువనగిరి నరసింహారావు, కట్టేగోల వెంకటేశ్వర్లు, తెలగమళ్ళ గోవిందు, అంబల రామారావు, మందడి వెంకటేశ్వర్లు, బోయిన రామనాథం, పందిటి వెంకటేశ్వర్లు, ఉల్లంగి పద్మ, కలకోట అరుణ, వడ్డేబోయిన వెంకటేశ్వర్లు, కారింగుల లక్ష్మీ, కెక్కెర్ల శ్రీనివాస్ రావు, కళాకారులు పమ్మి రవి, పాగి వెంకన్న , షేక్. అప్జల్తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్

-లింగ్యా నాయక్



**వికారాబాద్, డిసెంబర్,03(సమయం న్యూస్) :** దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని పుట్టుకతో వికలాంగత్వం కలిగితే నిరాశ పడకుండ మనో ధైర్యం తో దృడ సంకల్పంతో అన్ని రంగాలలో ముదంజ లో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. బుధవారము అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా మహిళా సమాఖ్య సమావేశము హాలు నందు జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా సమాజ అభివృది లో అందరికి సమాన హక్కులు కల్పించి పరిరక్షించే విధంగా అంతర్జీతీయ వికలాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. రాజ్యంగా పరంగా ఇచ్చిన హక్కులను సద్వినియోగ పరుచుకొని సమాజ అభివృది లో ముందుకు వెళ్ళాలని ఆకాంక్షించారు.అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం దివ్యాంగుల కు హక్కులను కలిపించడం తో పాటు సమాజంలో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల ఆత్మ స్తైర్యం తో ముందుకు వెళ్ళాలని , ప్రభుత్వం అన్ని విదాలుగా కృషి చేస్తుందని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.ఈ సందర్భంగా దివ్యాంగులు క్రీడలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రం తో పాటు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ అధికారిని కృష్ణవేణి, మెప్మా రవి కుమార్ ,శిశు సంక్షేమ శాఖ సిబ్బంది,దివ్యాంగులు. తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆవరణలోక్షుద్ర పూజలు..

### పోలీసులకు పిర్యాదు చేసిన ఉపాద్యాయులు..



**కోస్గి మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్) :** పాఠశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించిన సంఘటన కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం మీర్జాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో చోటుచేసుకుంది.బుధవారం ఉదయం పాఠశాలను శుభ్రం చేసేందుకు వచ్చిన అటెండర్ కృష్ణయ్య ఈ విషయం గమనించి ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. గ్రామస్థులు విద్యార్థుల తల్లితండ్రులు అప్పటికే పాఠశాలకు చేరుకొని ఈ సంఘటన పై అరా తీశారు.పాఠశాలలోని10 వ తరగతి గది ముందు ముగ్గు వేసి అందులో నిమ్మకాయలు, మిరుపకాయలు, ఉంచి కుంకుమ పసుపు తో పూజలు నిర్వహించడం తరగతి గది తాళనికి బొట్లు పెట్టడం గ్రామంలో కలకలం రేపింది. మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు బావిస్తుండగా ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి పిర్యాదు మేరకు పోలీసులు ఈ విషయం పై దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఈ విషయం పై జిల్లా విద్యాధికారికి సమాచారాన్ని అందించానని ప్రధానోపాధ్యాయులు జనార్ధనరెడ్డి తెలిపారు. ఎవరో ఆకాతాయిలు ఇలా చేసి ఉంటారని ఉపాధ్యా యులు విద్యార్థులకు సర్ది చెబుతూ ధైర్యం చెప్పి తరగతులు నిర్వహించేలా చొరవ చూపారు. పిల్లలను భయబ్రాంతులకు గురించేసే ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్‌ప్రమాణ స్వీకారం



**ఖమ్మం, డిసెంబర్ 03: ( సమయం న్యూస్ ) :** అత్యంత ఉత్సాహ భరిత కోలాహలం మధ్య బుధవారం ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ నూతన పాలక వర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రానైట్ మార్కర్ యూనియన్ కొత్త పాలకవర్గ సభ్యుల్ని యూనియన్ పెద్దలు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు ఉపేంద్ర లు కొత్త పాలకవర్గం నాయకులను సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు.ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ కొత్త అధ్యక్షులుగా కిషన్ , ఉపాధ్యక్షులు పాషా, ట్రెజరర్ గా సైదులు, సెక్రటరీగా షేక్ జానీ, ఉపాధ్యక్షులు 1. గిరి, ఉపాధ్యక్షులు 2. భద్రం, ట్రెజరర్ 2. రామ్మూర్తి, జాయింట్ సెక్రెటరీ నామాల నరసింహారావు, జాయింట్ సెక్రెటరీ 2. హనుమంతు, ఈసీ మెంబర్స్ వడ్లకొండ శీను శ్రీకాంత్, వెంకటేష్, అంజి, ఫయాజ్,దిలీప్, హలీం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ గ్రూప్ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటు పడతానని , గ్రూపులో ఉన్న సభ్యులకు ఏ సమస్య వచ్చినా వెనువెంటనే స్పందించి, ప్రతి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు . ప్రతి సభ్యునికి నా సహాయ సహకారాలు అందిస్తానని , అధ్యక్ష పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

# ఖమ్మం జిల్లాలో మొదటి దశ ఏకగ్రీవమైన పంచాయతీలు , వార్డులు

**ఖమ్మం , డిసెంబర్ 3 : ( సమయం న్యూస్ ) :** మొదటి దశ గ్రామ పంచాయితీ ఎన్నికలలో బుధవారం నామినేషన్ల స్క్రూటిని అనంతరం మొత్తం 192 గ్రామ పంచాయతీలకు గాను ఈ క్రింది గ్రామపంచాయతీలలో సర్పంచ్ , వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఆ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బోనకల్ మండలంలోని కలకోట గ్రామపంచాయతీ, చింతకాని మండలంలోని రాఘవాపురం మరియు రేపల్లెవాడ గ్రామపంచాయతీలు,మధిర మండలంలోని సిద్ధినేనిగూడెం, సైదల్లిపురం గ్రామపంచాయతీలు, వైరా మండలంలోని లక్ష్మీపురం, గోవిందాపురం, నారపునేనిపల్లి గ్రామపంచాయతీలు,రఘునాథపాలెం మండలంలోని మల్లేపల్లి, రేగుల చలక, మంగ్య తండా, రాములు తండా గ్రామపంచాయతీలు , ఎర్రుపాలెం మండలంలోని గోస వీడు, చొప్పకట్లపాలెం, జమలాపురం, కండ్రిక ,గట్ల గౌరారం , కాచవరం గ్రామపంచాయతీలు మొత్తం 192 సర్పం చ్ లకు గాను 19 సర్పంచ్ లు ఏకగ్రీవం కాగా మిగిలిన గ్రామ పంచాయతీలు: 547 గ్రామపంచాయతీలలో సర్పంచు లకు ఎన్నిక జరగనుంది. మొత్తం 1740 వార్డులకు గాను , 220 వార్డు ఏకగ్రీవం కాగా మిగిలిన 1520 వార్డులకు ఎన్నిక జరగనుంది.

# ఆసుపత్రుల భవనల నిర్మాణానికి స్థల సేకరణ చేయండి..

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి డిసెంబర్ 03 ( సమయం న్యూస్).:** ఆసుపత్రి భవనాల నిర్మాణానికి స్థల సమస్య ఉన్న ప్రాంతాలపై కాటారం సబ్ కలెక్టర్, భూపాలపల్లి ఆర్డీఓకు నివేదికలు అందచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ రాజ్, టీజీఈడబ్ల్యూఐడీసీ, ప్రణాళిక శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న పనులు, పురోగతి, నిధుల వినియోగం, భౌతిక ప్రగతి వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాలల్లో రూ.75 లక్షల వ్యయంతో చేపడుతున్న అదనపు తరగతి గదుల భవనం త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఈ భవనం చాలాకాలంగా నిర్మాణంలో జాప్యం జరుగుతోందని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే కృటికల్ కేర్ కేంద్రాన్ని జనవరి నెలలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో సిబ్బంది సమయ పాలన పాటించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబూరావు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ ప్రసాద్, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించవచ్చు విద్యాశాఖ అధికారి -శంకర్ నాయక్.



**కోస్గి మున్సిపల్(మం)డిసెంబర్,03(సమయం న్యూస్):** ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యాన్ని కూడా జయించవచ్చని మండల విద్యాశాఖాధికారి శంకర్ నాయక్ అన్నారు. బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా లోని కోస్గి భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యకమనికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.వైకల్యం అనేది శరీరానికి తప్ప మేధస్సు కాదని,ఎంతోమంది వైకల్యం కలిగి ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు వైకల్యం కలిగిన పిల్లలను ప్రోత్సహించి వారు కూడా సాదారణ పిల్లలవలే చదువుకునేలా చూడాలని అన్నారు. భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రవాణా అలవెన్స్, సాధారణ పాఠశాలకు వచ్చే వైకల్యం కలిగిన బాలికలకు ఉపకార వేతనాలు, ఇతరుల సహాయం తో బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్, కంటిచూపు తక్కువగా ఉన్న విద్యార్థులకు రీడర్ అలవెన్స్ ఇచ్చి వారు కూడా చదువుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. పూర్తిగా బడికి రాలేని వారికి ఇంటివద్దనే విద్య అందిస్తున్నట్లు చెప్పారు.ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా ఉపకారణాలను అందిస్తూ వారిని రోజు వారి కార్యక్రమాలు చేసుకునేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, మరియు వారి తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు ఈ కార్యక్రమంలో కోస్గి మండల విద్యాధికారి శంకర్ నాయక్, ఉపాధ్యాయులు నిరంజన్ ,జయమ్మ, నరేష్, నవిత,నవీన్ కుమార్, బాల్‌రాజ్,పద్మావతి,పాఠశాల . హెచ్.ఎం.విష్ణచారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జయంతి వేడుకలు

### చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

### విద్యార్థులకు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జీవిత చరిత్ర గురించి తెలిపిన పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి నరేష్ రాజ్



**కొడంగల్ మున్సిపల్,డిసెంబర్,03(సమయం న్యూస్) :** ఘనంగా మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ జయంతిని జరుపుకున్న కొడంగల్ పట్టణ కేంద్రంలోని నవీన ఆదర్శ స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయ బృందం. ముందుగా మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ డి వి నరేష్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు డాక్టర్ రాజేంద్రప్రసాద్ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష , ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా.భవితా సెంటర్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు




**పరిగి మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్) :** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిగి మండల కేంద్రంలోని భవితా సెంటర్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ ఆటల పోటీలు పాటల పోటీలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీడీఓ హరి ప్రియా రెడ్డి మండల విద్యాధికారి గోపాల్ పాల్గొని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి తాము కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రత్యేక ఉపాధ్యాయులు మహేందర్, జ్యోతి ధన్యవాదాలు తెలియజేశారు.

## సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే గోల్డెన్ హావర్ లో కాల్ చేయాలి.



**వికారాబాద్, డిసెంబర్,03(సమయం న్యూస్) :** తెలంగాణ డీజీపీ ఆదేశాల మేరకు,జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం తరఫున సైబర్ నేరాల నివారణ మరియు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా,బుధవారం వికారాబాద్ పట్టణంలోని విశ్వభారతి కళాశాలలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిటిసి డీఎస్పీ శ్రీనివాస్ మరియు వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి లతో పాటు వికారాబాద్ ఎస్.హెచ్.ఓ. (%ూనూ%) హాజరయ్యారు.ఇట్టి కార్యక్రమం లో పాల్గొన్న అధికారులు కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సైబర్ నేరగాళు ఏ విధంగా కొత్త పద్ధతుల్లో లింకులు, సందేశాలు, నకిలీ మెయిల్స్ పంపి మోసాలకు పాల్పడుతున్నారో సవివరంగా తెలియజేశారు. ముఖ్యంగా, మోసం జరిగిన వెంటనే అప్రమత్తమై నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయడం యొక్క ప్రాముఖ్యత, తద్వారా నిధులను నిలిపివేసేందుకు ఉపకరించే గోల్డెన్ అవర్ (%+శీశ్రీaవల ఎశీబతీ%) మరియు పి.ఓ.హెచ్. (%ూశీఒ%) గురించి వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ముగింపులో, సైబర్ నేరాలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని, ఎటువంటి మోసాలకు గురికాబోమని విద్యార్థులు మరియు కళాశాల సిబ్బందితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే ఓట్లను స్వస్తిక్ గుర్తుతో కేటాయించాలి

**-టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు గౌరారం గోపాల్**



**బొంరస్ పేట మండలం, డిసెంబర్,03(సమయం న్యూస్) :** బొంరస్ పేట పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాకుండా స్వస్తిక్ గుర్తుతో ఓటు వేసే అవకాశం కల్పించాలని వికారాబాద్ జిల్లా బొంరస్ పేట మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు వినతి పత్రం అందజేసిన యుటిఎఫ్ నాయకులు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల విధులలో పాల్గొనె ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే ఓట్లన్నీ కూడా స్వస్తిక్ గుర్తుతో వేసేటట్టు అవకాశము కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీలలో ఓటింగ్ పూర్తయిన అనంతరం మొదటగా పోస్టల్ బ్యాలెట్ గణన జరుగుతుంది. అప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి సిగ్నేచర్ తో వేసుకున్న రహస్య ఓటు ఎవరికి వేశారో బహిర్గతమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆయా గ్రామాలలో ఉద్యోగ ఉపాధ్యాయులు తక్కువ సంఖ్యలో ఉండడం వలన ఉద్యోగులు వేసే ఓటు వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివరాజ్ పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో వారం లో రెండు రోజులు 'ప్రజావాణి' కార్యక్రమం ఏర్పాటు

● జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS.



**%వికారాబాద్, డిసెంబర్,03(సమయం న్యూస్) :** జిల్లా ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే వారంలో అన్ని రోజులలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ గారిని కలవవచ్చు, ఫిర్యాదు చేయవచ్చు. పెండింగ్‌లో ఉన్న మరియు అడ్వార్స్ పిటిషన్లను పరిష్కరించడంపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించినారు. కావున పెండింగ్, అడ్వార్స్ ఫిర్యాదు దారులు ప్రత్యేకంగా కలవడానికి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ వారానికి రెండు రోజులు ప్రతి మంగళవారం మరియు గురువారం నాడు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంట వరకు "ప్రజావాణి" కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ రెండు రోజుల్లో పెండింగ్, అడ్వార్స్ , ఇతర ఏమైనా ఫిర్యాదులు ఉన్న,ఫిర్యాదు దారులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకురావచ్చు అని జిల్లా ఎస్పీ తెలియజేయడం జరిగింది.ఈ అద్భుత అవకాశాన్ని వికారాబాద్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి సంకోచం లేకుండా, ధైర్యంగా తమ సమస్యలను విన్నవించుకోవాలని ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్, కోరారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలి

- కోస్గి సీఐ సైదులు
- ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరు పాటించాలి.
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు



బుధవారం కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్ లు కలిసి కొడంగల్ నియోజకవర్గం కొత్తపల్లి మండలం %-% గోకుల్‌నగర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు తెలియజేశారు. అధికారులు గ్రామస్తులకు ఇచ్చిన సూచనలు:ఎలాంటి ప్రలోభాలకు, డబ్బు, మద్యం పంపిణీకి లోనుకాకుండా చట్టపరమైన అవగాహనతో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద చలనం ఏమైనా గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను సూచించారు.ఎన్నికల సమయంలో అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను అందరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, ద్వేషపూరిత పోస్టులు పెట్టడం కఠిన చట్టపరమైన చర్యలకు గురి చేస్తుందని హెచ్చరించారు.సీఐ సైదులు మాట్లాడుతూ,"ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగ. ప్రతి ఒక్కరి సహకారం ఉంటేనే పూర్తిగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయి. పోలీసులు 24 గంటలు అందు బాటులో ఉన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తెలియ జేయండని పేర్కొన్నారు.ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ..."విభేదాలు లేకుండా గ్రామస్తులు ఒకరికొకరు సహకరించి, పరస్పర గౌరవంతో ఎన్నికలు పూర్తి చేయాలి. చట్టవ్యతిరేక చర్యలకు కఠిన చర్యలు తప్పవు" అని అన్నారు.అధికారులతో పాటు స్థానిక పోలీసులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రం తక్షణ సహాయం అందించాలి.

- వరంగల్ కు మొంథా తుఫాన్ కారణంగా జరిగిన నష్టానికి
- అమృత్ 2.0 కింద ప్రత్యేక నిధులు విడదల చేయాలి.
- GWMC మౌలిక వసతులపై హై లెవల్ ఆడిట్ చేయాలి.
- రియల్-టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలి
- రోడ్లు-డ్రైనేజ్ పునరుద్ధరణకు ప్రత్యేకంగా 100 కోట్లు మంజూరు చేయాలి.
- వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్దే నా ధ్యేయం
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**న్యూ ఢిల్లీ డిసెంబర్3( సమయం న్యూస్).:** వరంగల్ నగరంలో అక్టోబర్‌లో మ్పొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలు, తుఫాను వల్ల కలిగిన భారీ నష్టంపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో జీరో అవర్‌లో గళమెత్తారు . గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురవడంతో శివనగర్, ఎన్ఎన్‌నగర్, డీకేనగర్ సహా 45 కాలనీలు తీవ్రంగా మునిగిపోయాయని ఎంపీ వివరించారు.పోతన రోడ్, భద్రకాళి-పాలిటెక్నిక్ రోడ్, ములుగు రోడ్, బొండివాగు, పోచమ్మమైదాన్ 80 అడుగుల రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలతో నిండిపోయాయని, కొన్నిచోట్ల రహదారులు నదులుగా మారాయని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. ఆ సమయంలో ఒక గర్భిణిని ట్రాక్టర్‌లో తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. భారీ వర్షాల సమయంలో 1,200 మందిని 12 రిలీఫ్ క్యాంపులకు తరలించాల్సి వచ్చిందని ఎంపీ వెల్లడించారు. %స్మార్ట్ సిటీల కింద చేపట్టిన డ్రైనేజీ పనులు 66% మాత్రమే పూర్తికావడంతో ఈ దుర్ఘటన మరింత పెరిగిందన్నారు. ఇది పూర్తిగా ప్రణాళికా వైఫల్యం అని వ్యాఖ్యానించారు.2.0 కింద ప్రత్యేక నిధులు మార్చి 2026లోగా విడుదల చేయాలని, మౌలిక వసతులపై ఉన్నత స్థాయి ఆడిట్ ఆదేశించాలని, రహదారి పునర్నిర్మాణానికి 100 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కేంద్రాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.హెరిటేజ్, స్మార్ట్ సిటీ అయిన వరంగల్ ప్రతి సంవత్సరం వర్షాలతో విధ్వంసం కాకుండా, కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కార దిశగా మౌలిక వసతులు కల్పించాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

### 5న నర్సంపేటలో సీఎం పర్యటన.

రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సిద్ధమవుతున్న సభావేదికనర్సంపేట, ఆంధ్రప్రభ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. వెయ్యి కోట్ల అభివృద్ధి పనులకు నర్సంపేటలో శంకుస్థాపన చేయనున్నారు. ఈనెల 5వ తేదీన నర్సంపేట మెడికల్ కాలేజ్ ప్రాంతంలో భారీ బహిరంగ సభలో పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రకటించారు.శుక్రవారం ఒంటిగంటకు సీఎం రానున్నట్లు తెలిపారు. సీఎం చేతుల మీదుగా వెయ్యి కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు పేర్కొన్నారు.గతంలో ఎడమొఖం పెడముఖంగా ఉన్న ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్య సయోధ్య కుదరడంతో మొట్టమొదటిసారిగా సీఎం రేవంత్ రెడ్డి నర్సంపేటకు వస్తూనే రూ.1000 కోట్ల అభివృద్ధి పనులకు జీవో కూడా విడుదల చేశారు.నర్సంపేట పట్టణం, నియోజకవర్గంలోని రూ.228 కోట్లతో రోడ్ల అభివృద్ధి, రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.150 కోట్లతో మెడికల్ కాలేజ్, రూ.25 కోట్లతో నర్సింగ్ కాలేజ్, రూ.20 కోట్లతో నర్సంపేట పట్టణం మున్సిపాలిటీ విలీన గ్రామాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, సెంట్రల్ లైటింగ్, నర్సంపేట పోలీస్ స్టేషన్ నుండి నాగూర్ల పల్లె మాదన్నపేట వరకు సెంట్రల్ లైటింగ్, సీసీడబుల్ రోడ్డు నిర్మాణం, నర్సంపేట నుండి మాగ్దం పురం- రాజపల్లె వరకు డబుల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్, మహేశ్వరం లోపలికి సెంట్రల్ లైటింగ్ డబుల్ రోడ్డు, 400 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రకటించారు.వరంగల్ నుండి ధర్మారం మీదుగా నర్సంపేట వరకు రూ.83కోట్లతో 4 లైన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. నర్సంపేట నుండి పాకాల వరకు 10 కిలోమీటర్లు డబుల్ రోడ్డు రూ.17కోట్ల 28 లక్షలతో రోడ్డు నిర్మాణం, నెక్కొండ కే సముద్రం. 12.10 కిలోమీటర్లు రూ.38 కోట్ల 74 లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం, నర్సంపేట నుండి నెక్కొండ వరకు 18. 47 కిలోమీటర్లు రూ.56 కోట్ల 40 లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.

నెక్కొండ గూడూర్ డబుల్ రోడ్డు పది కిలోమీటర్లు రూ.33కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. శుక్రవారం నిర్వహించే సీఎం సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ త్వరగా పనులు పూర్తి చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

## పోస్టల్ బ్యాలట్ పత్రాల పంపిణి సక్రమంగా జరగాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం డిసెంబర్3( సమయం న్యూస్).:** గామ పంచాయతీ ఎన్నికల సందర్భంగాపోస్టల్ బ్యాలట్ పత్రాలను సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు సరిగ్గా పంపిణి జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారుపోస్టల్ బ్యాలట్ పంపిణి, నిర్వహణ మీద బుధవారం... అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జడ్పీ సీఈఓ, డిపి ఓ, అన్ని మండలాల ఎంపీడీఓ లు, తహసీల్దార్ లతో, ఎంపీవో లతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేసారుముందుగా పోస్టల్ బ్యాలట్ పంపిణి, నిర్వహణ తదితర అన్ని ప్రక్రియలకు సంబందించి...మాస్టర్ ట్రైనర్ రామరాజు పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా అధికారులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారుఅనంతరం కలెక్టర్ మాట్లాడుతు...మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈ నెల 9 వ తేదీన ఎంపిడిఓ కార్యాలయం లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ కేంద్రం కు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారురెవెన్యూ శాఖ అధికారి.. గెజిటెడ్ అధికారిగా ఫారం 17 లో సంతక చెయ్యడానికి అందుబాటులో ఉంటారన్నారుగ్రామ పంచాయతీ ఎన్నికల అధికారి.. దానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తారన్నారుఎవరికి అయితే పోస్టల్ బ్యాలట్ ఇస్తున్నామో వారి వివరాలు ఒక రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు .ఓటరు సహాయక కేంద్రం లో ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేయాలన్నారు.సర్వీస్ ఓటర్లకు పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా తయారు అయిన తర్వాత 24 గంటల్లోపు పోస్ట్ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారి పంపాలన్నారు. వివరాలను రికార్డు చేయాలి అని సూచించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ తిరిగి కార్యాలయం కు చేరినపుడు సంబంధిత ఎన్నికల అధికారి చేరిన సమయం తేదీ రికార్డు చేయాలని... కౌంటింగ్ కు సమయానికి ఒక గంట ముందు చేరిన అన్ని పోస్టల్ బ్యాలెట్ లను కౌంటింగ్ కు అనుమతిస్తారన్నారు.జిల్లా స్థాయి లో కలెక్టరెట్ , మండల స్థాయి లో తహసీల్దార్ లు నోడల్ ఆఫీసర్ గా ఉంటారని...మొత్తం ప్రక్రియ వీడియో గ్రాఫి చేయలని..పోటీ చేసే అభ్యర్థులు కూడా ఈ ప్రక్రియ ను పరిశీలించవచ్చన్నారు.పోలింగ్ కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.పోలింగ్ జరిగే ప్రాంతాల లో పంపిణీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈ నెల 6 న పోలింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.రేపు మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో అభ్యర్థుల తో ఎన్నికల వ్యయానికి సంబంధించిన అవగాహన కార్యక్రమ మును ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారుఈ కార్యక్రమ లో అభ్యర్థులు, మండల స్థాయి అధికారులు అభ్యర్థులు పాల్గొనాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ.. పోస్టల్ బ్యాలట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ వివరించారు.ఎంపిడిఓ లు, తహసిలదార్లు, ఎన్నికల అధికారి రోజు విధులు గురించి ఎన్నికల కార్యక్రమ సన్నద్ధం గురించి వివరించారు.గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నిక, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉప సర్పంచ్ ఎన్నిక సందర్భంగా.. నిర్వహించాల్సిన ముఖ్య విధులు, వీటికోసం సవివరమైన ప్రణాళికను రూపొందించుకోవాలన్నారుఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడానికి ముందస్తు ప్రణాళిక, దూరదృష్టి అత్యవసరమన్నారుసమయానుగుణంగా నిర్వహించాల్సిన ప్రణాళికను డైరీలో వ్రాసుకొని ప్రతి అంశం సకాలంలో పూర్తి చేస్తూ, ప్రతి విషయానికి సంబంధించి చేసిన పురోగతిపై రిమార్కులు వ్రాసుకోవాలన్నారుదీనితో పాటుగా ఏవైనా సమస్యలు ఉన్నచో ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధారిటీ లేదా డిప్యూటీ జిల్లా ఎన్నికల అధారిటీ దృష్టికి తీసుకొని రావాలని తెలిపారు



## తిరిగి టీంలోకి వచ్చిన శుభ్‌మన్

### టీ20 సిరీస్‌కు ఇండియా జట్టు ప్రకటన

దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. మెడ గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌కు దూరమైన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి జట్టులోకి వచ్చాడు. సూర్యకుమార్ యాదవ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. దక్షిణాఫ్రికా ప్రస్తుతం టీమిండియా వన్డేలు ఆడుతోంది. రెండో వన్డే రాయ్‌పూర్‌లో జరుగుతోంది. మూడో వన్డే ఆరో తేదీ విశాఖలో జరగనుంది. ఈ సిరీస్‌కు రాహుల్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ డిసెంబర్ 9 నుంచి డిసెంబర్ 19 వరకు జరుగుతుంది. డిసెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించింది. 2025 ఆసియా కప్‌లో ఆడిన జట్టునే సెలక్టర్లు ఎంపిక చేశారు. వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ నలుగురు స్పిన్నర్లు. అదనంగా, 15 మంది సభ్యుల జట్టులో ముగ్గురు ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు: జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా. బ్యాటింగ్ విభాగంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ, సంజూ శాంసన్ ఉన్నారు. జితేష్, శాంసన్ ఇద్దరు వికెట్ కీపర్లు. దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు భారత జట్టు - సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, సంజు శామ్సన్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ భారత్-దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ డిసెంబర్ 9న కటక్‌లో జరుగుతుంది. రెండో టీ20 మ్యాచ్ డిసెంబర్ 11న న్యూ చండీగఢ్‌లో, మూడో టీ20 మ్యాచ్ డిసెంబర్ 14న ధర్మశాలలో జరుగుతుంది. నాలుగో టీ20 మ్యాచ్ డిసెంబర్ 17న లక్నోలో, చివరి, ఐదవ టీ20 మ్యాచ్ డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.



## మోహిత్ శర్మ క్రికెట్‌కు వీడ్కోలు

టీమిండియా వెటరన్ పేసర్ మోహిత్ శర్మ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని ఫార్మాట్స్‌కు అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటిస్తున్నానని తెలిపాడు. బుధవారం ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా 37 ఏళ్ల మోహిత్ శర్మ తన నిర్ణయాన్ని వెల్లడించాడు.'ఈ రోజు నేను అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలుకుతున్నాను. హర్యానాకు ప్రాతినిధ్యం వహించడం నుంచి భారత్ జెర్సీ ధరించి ఐపీఎల్ ఆడేవరకు సాగిన నా ప్రయాణం నాకు దక్కిన వరం.'అని మోహిత్ శర్మ పేర్కొన్నాడు. మోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై తన చివరి ఐపీఎల్ టీమ్ ఢిల్లీ క్యాపిటల్స్ స్పందించింది. 'మీ బ్యాక్-ఆఫ్-ది-హ్యాండ్ స్లోయర్ బంతులతో డెత్ ఓవర్లలో బౌలింగ్‌ను విప్లవాత్మకం చేశారు. గొప్ప కెరీర్‌కు అభినందనలు, మోహిత్ భాయ్' అని ప్రశంసించింది.అంతర్జాతీయ క్రికెట్‌లో మోహిత్ శర్మ సుదీర్ఘ కాలం ఆడకపోయినప్పటికీ బౌలర్‌గా తనదైన ముద్ర వేసుకున్నాడు. హర్యానాతో దేశవాళీ క్రికెట్ కెరీర్ ప్రారంభించిన మోహిత్ శర్మ.. భారత్‌కు కూడా ప్రాతినిధ్యం వహించాడు. కానీ ఐపీఎల్ 2013లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మెరుగైన ప్రదర్శన చేయడంతోనే అతనికి గుర్తింపు లభించింది. ముఖ్యంగా డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా అతనికి ప్రత్యేక గుర్తింపు ఉంది. భారత్ తరఫున 2013లో జింబాబ్వేతో జరిగిన వన్డే మ్యాచ్‌తో మోహిత్ శర్మ అరంగేట్రం చేశాడు. 2015 వన్డే ప్రపంచకప్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. భారత్ తరఫున 26 వన్డేలు ఆడి 31 వికెట్లు, 6 టీ20ల్లో 6 వికెట్లు తీసాడు. 2015లోనే మోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. ఆ తర్వాత అతనికి అవకాశాలు రాలేదు. చివరిసారిగా అతను సౌతాఫ్రికాతో 2015లో వన్డే మ్యాచ్ ఆడాడు. ఐపీఎల్‌లో మోహిత్ శర్మ చెన్నై సూపర్ కింగ్స్ (2013-2015, 2019), పంజాబ్ కింగ్స్ (2016-2018), ఢిల్లీ క్యాపిటల్స్ (2020), గుజరాత్ టైటాన్స్ (2023-2024) తరఫున ఆడాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో మొత్తం 120 మ్యాచ్‌లు ఆడిన మోహిత్.. 134 వికెట్లు పడగొట్టాడు.

# కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ స్వైరవిహారం



రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో రుతురాజ్‌గైక్వాడ్, విరాట్ కోహ్లీ సెంచరీలతో రెచ్చిపోయారు. మొదట్లో బ్యాటింగ్ చేయడానికి భారత్ బ్యాట్స్‌మెన్ కాస్త ఇబ్బంది పడ్డారు. అదే టైంలో సఫారీలు మాత్రం వైడ్‌ల రూపంలో పరుగులు సమర్పించుకోవడంతో భారత్‌పై ఒత్తిడి పడలేదు. అయితే 62 పరుగుల వద్ద భారత్ రెండు వికెట్లు కోల్పోయింది. అప్పుడు కోహ్లీకి గైక్వాడ్ జత కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ 77 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. 105 పరుగులు వద్ద అవుట్ అయ్యాడు. తర్వాత విరాట్ కోహ్లీ 90 బంతుల్లో సెంచరీ చేశాడు. తర్వాత స్కోరు పెంచే క్రమంలో 102 పరుగులకు అవుట్ అయ్యాడు. తన ఇన్నింగ్స్‌లో 7 ఫోర్‌లు, రెండు సిక్స్‌లు కొట్టాడు. మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక సిరీస్‌లో భారత్ vs దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న రెండవ 50 ఓవర్ల మ్యాచ్‌లో ఆడుతూ విరాట్ కోహ్లీ తన 53వ వన్డే సెంచరీని సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌తో, అతను చరిత్రలో అత్యధిక వన్డే సెంచరీల రికార్డును తానే బద్దలు కొట్టాడు, 49 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్న సచిన్ టెండూల్కర్ కంటే నాలుగు సెంచరీలు ముందంజలో ఉన్నాడు. ఈరోజు కోహ్లీ 90 బంతులు ఎదుర్కొని, రెగ్యులర్ స్ట్రైక్ రొటేషన్, హిట్టింగ్‌తో అద్భుతమైన సెంచరీ సాధించాడు. టాప్ 5లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాత్రమే యాక్టివ్ ప్లేయర్లు, ఇప్పట్లో విరాట్ నెమ్మదించే సూచనలు కనిపించడం లేదు. అతను తన ఆటను ముగించే సమయానికి ఈ సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉన్నట్టు స్పష్టమవుతోంది. మూడో స్థానంలో ఉన్న రోహిత్ కూడా తన సెంచరీల సంఖ్యను ఎంత పెంచినా మూడో స్థానం దాటి వెళ్లే అవకాశాలులేవు. రుతురాజ్ గైక్వాడ్ జాతీయ జట్టు తరఫున తన తొలి సెంచరీని నమోదు చేయడం ద్వారా వ్యక్తిగత మైలురాయిని చేరుకున్నాడు. ఇండియా A తరఫున ఇంతకు ముందు సెంచరీలు చేశాడు, కానీ సీనియర్ జట్టు తరఫున ఇది అతని తొలి సెంచరీ. న్యూ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో 77 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు బాది ఈ ఘనతను సాధించాడు. ఈ చిరస్మరణీయ సెంచరీ సాధించడంలో, గైక్వాడ్ విరాట్ కోహ్లీతో కలిసి 150 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా నెలకొల్పాడు. వీరు ఇద్దరూ కలిసి భారత్‌ను స్థిరమైన రన్‌రేటుతో భారత్ స్కోరు పెంచడంలో కీలక పాత్ర పోషించారు. ఈ పిచ్‌పై విజయం సాధించాలంటే 300 పరుగుల మార్కును దాటాల్సి ఉంటుంది. రాంచీలో జరిగిన తొలి ODI మ్యాచ్‌లో 350 పరుగుల లక్ష్యాన్ని ఇచ్చినా ప్రోటీస్ జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఈరోజు గెలిస్తే భారత్‌కు సిరీస్ విజయం లభిస్తుంది, ఇది ఆస్ట్రేలియాతో జరిగిన 2-1 ODI సిరీస్‌ను కోల్పోయిన తర్వాత, దక్షిణాఫ్రికాతో జరిగిన 2-0 టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తర్వాత కూడా వారికి మంచి బూస్ట్‌లా మారుతుంది.

## స్వదేశంలో కోహ్లీ 6,500 వన్డే పరుగులు

దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న రెండో వన్డేలో టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. మొన్న రాంఛీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీ సాధించిన కోహ్లీ.. ఇప్పుడు రెండో వన్డేలోనూ సెంచరీతో అదరగొట్టాడు. దీంతో వన్డేల్లో అత్యధిక శతకాలు సాధించిన రెండో బ్యాటర్‌గా ఘనత సాధించడం సహా స్వదేశంలో 6,500 వన్డే పరుగులు చేసిన రెండవ బ్యాటర్‌గానూ నిలిచాడు. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన 2వ వన్డేలో కోహ్లీ ఈ మైలురాయిని చేరుకున్నాడు. అయితే కోహ్లీ కంటే ముందు అత్యధిక సెంచరీలు, స్వదేశంలో 6,500 పరుగులు రాబట్టిన బ్యాటర్ల లిస్టులో మాస్టర్ బ్లాస్టర్ సచిన టెండూల్కర్ ముందున్నాడు. ఆ తర్వాత రెండో స్థానంలో విరాట్ కోహ్లీ నిలిచాడు. రాయ్‌పూర్‌లో జరుగుతోన్న వన్డేలో కోహ్లీ తన 40వ పరుగుతో సచిన్ టెండూల్కర్ మైలురాయిని చేరుకున్నాడు. అయితే విరాట్ కోహ్లీ మాత్రం తన 126 మ్యాచ్ (123 ఇన్నింగ్స్)లో స్వదేశంలో జరిగిన వన్డే మ్యాచ్‌ల్లో 6,500 పరుగులు రాబట్టిన ఈ ఘనత సాధించడం గమనార్హం. అయితే సచిన్ టెండూల్కర్ మాత్రం తాను ఆడిన 164 స్వదేశీ వన్డేల్లో 48.11 సగటుతో 6,976 పరుగులు రాబట్టి ఆ జాబితాలో తొలిస్థానంలో ఉన్నాడు. సచిన్ కేవలం 20 సెంచరీలు, 38 హాఫ్ సెంచరీలు సాధించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ ఇప్పటికే 25 సెంచరీలు సాధించి.. స్వదేశీ వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ, సచిన టెండూల్కర్ తప్ప మరెవరూ టీమ్‌ఇండియా బ్యాటర్లు స్వదేశంలో జరిగిన వన్డేల్లో 5,500 పరుగులు చేయకపోవడం గమనార్హం. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ 5,406 రన్స్ చేసి ఈ జాబితాలో కోహ్లీ కంటే వెనుక స్థానంలో ఉన్నాడు. అదే విధంగా స్వదేశంలో 5,000 కంటే ఎక్కువ పరుగులు చేసిన మరో ఆటగాడిగా జాక్వెస్ కల్లిస్ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. క్రికెట్ గణాంకాల ప్రకారం.. స్వదేశంలో వన్డేల్లో విజయవంతమైన రన్-ఛేజింగ్‌లలో కోహ్లీ అత్యధిక పరుగులు సాధించాడు. ఈ విషయంలో అతను 82.12 సగటుతో (11 సెంచరీలు) 2,710 పరుగులు సాధించాడు. సచిన్ 2,308 పరుగులతో కోహ్లీ తర్వాతి స్థానంలో ఉన్నాడు.

## చిక్కుల్లో పేసర్ హర్షిత్ రాణా



టీమిండియా స్టార్ పేసర్ హర్షిత్ రాణా చిక్కుల్లో పడ్డాడు. సౌతాఫ్రికాతో తొలి వన్డేలో అత్యుత్సాహం ప్రదర్శించిన హర్షిత్ రాణాపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) కఠిన చర్యలు తీసుకుంది. ఐసీసీ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించినందుకు గట్టిగా మందలించడంతో పాటు ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించింది. రాంచీ వేదికగా గత ఆదివారం జరిగిన తొలి వన్డేలో హర్షిత్ రాణా ప్రత్యర్థి ఆటగాళ్లను ఔట్ చేసిన తర్వాత అతిగా సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా డెవాల్డ్ బ్రెవిస్ వికెట్ తీసి పెవిలియన్‌కు వెళ్లిపోవాలంటూ సైగలు చేశాడు. ఈ ఓవరాక్షన్‌పై అంపైర్లు మ్యాచ్ రిఫరీకి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. ఈ నేరాన్ని హర్షిత్ రాణా అంగీకరించడంతో వార్నింగ్‌తో పాటు ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ మేరకు ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది.'గత 24 నెలల్లో హర్షిత్ రాణాకు ఇది డీమెరిట్ పాయింట్. ఈ కుడిచేతి వాటం పేసర్ తన తప్పిదాన్ని అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ విధించిన శిక్షకు సమ్మతం తెలిపాడు. హర్షిత్ రాణా ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్లేయర్స్ అండ్ ప్లేయర్ సపోర్ట్ పర్సనల్ నిబంధనల్లోని ఆర్టికల్ 2.5 రూల్‌ను ఉల్లంఘించాడు. ఈ రూల్ ప్రకారం అంతర్జాతీయ మ్యాచ్‌లో బ్యాటర్ ఔటైనప్పుడు రెచ్చగొట్టేలా ప్రవర్తించడం, సైగలు చేయడం చేయవద్దు.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. రెండేళ్ల కాలంలో ఒక ఆటగాడి ఖాతాలో నాలుగు డీమెరిట్ పాయింట్స్ చేరితే ఓ టెస్ట్ మ్యాచ్ లేదా రెండు వన్డేలు, రెండు టీ20లు ఆడకుండా నిషేధం విధిస్తారు. ప్రస్తుతం హర్షిత్ రాణా ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్ చేరింది. మరో రెండేళ్ల కాలంలో మరో మూడు డీమెరిట్ పాయింట్స్ చేరితే హర్షిత్ రాణాపై నిషేధం పడనుంది. ఐపీఎల్‌లో హర్షిత్ రాణా ఫ్లయింగ్ కిస్ సెలెబ్రేషన్స్‌తో ఓ మ్యాచ్ నిషేధం ఎదుర్కొన్నాడు. మూడు సార్లు తన తప్పిదాన్ని రిపీట్ చేయడంతో ఐపీఎల్ నిర్వాకులు అతన్ని ఓ మ్యాచ్ ఆడకుండా నిషేధం విధిస్తూ కఠిన చర్యలు తీసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అతనే అదే శైలిని కొనసాగిస్తున్నాడు. రాంచీ వన్డేలో హర్షిత్ రాణా అద్భుతమైన బౌలింగ్‌తో భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 10 ఓవర్లు బౌలింగ్ చేసి 65 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 17 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే.



## టీమిండియా టీ20 జెర్సీ ఆవిష్కరణ

అప్‌కమింగ్ ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా ధరించే జెర్సీని మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆవిష్కరించాడు. బుధవారం సౌతాఫ్రికాతో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డే విరామ సమయంలో ఈ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడైన రోహిత్.. ముఖ్య అతిథిగా హాజరై భారత జెర్సీని ఆవిష్కరించాడు.రోహిత్ శర్మతో పాటు టీమిండియా టీ20 ప్లేయర్ తిలక్ వర్మ కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యాడు. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియాతో పాటు టీమిండియా జెర్సీ స్పాన్సర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ ముగియగానే భారీ సైజ్ టీ20 ప్రపంచకప్ జెర్సీని మైదానంలో ప్రదర్శించారు. అనంతరం తిలక్ వర్మతో కలిసి రోహిత్ శర్మ ఈ జెర్సీలను బ్రాడ్‌కాస్టర్స్‌తో పాటు మీడియాకు చూపించాడు. నీలిరంగులో ఉన్న ఈ జెర్సీ.. రెండు వైపులా వైబ్రెంట్ ఆరెంజ్ ప్యానెల్స్ ఉన్నాయి. జెర్సీపై వర్టికల్ బ్లూ స్ట్రైప్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా రోహిత్ శర్మ మాట్లాడుతూ.. టీమిండియా రెండో టీ20 ప్రపంచకప్ గెలుచుకునేందుకు 15 ఏళ్ల నిరీక్షించాల్సి వచ్చిందని చెప్పాడు.'ఇది సుదీర్ఘ ప్రయాణం. మేం 2007లో మా తొలి ప్రపంచకప్‌ను గెలిచాం. ఆ తర్వాత మరో ప్రపంచకప్ గెలవడానికి 15 ఏళ్ల కంటే ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వచ్చింది. ఎన్నో ఒడిదుడుకులతో ఈ ప్రయాణం సాగింది. కానీ మళ్లీ ట్రోఫీని ఎత్తడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. ఇప్పుడు భారత్‌లో ప్రపంచకప్ జరుగుతుండటం ఉత్సాహపరిచే విషయం. భారత జట్టుకు నా మద్దతు శుభాకాంక్షలు ఎప్పుడూ ఉంటాయి. జట్టులోని ప్రతీ ఒక్కరు విజయం కోసం కృషి చేస్తారని భావిస్తున్నా.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.



## ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?

ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు-ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు

### ఔట్‌పుట్ రావాలంటే..సమిష్టిగా పనిచేయాల్సిందే... తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెళి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు..అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం-పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడించారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. ఇక్కడ 8 గంటల రూల్ ప్రాక్టికల్‌గా చాలా కష్టం అని స్పష్టం చేశారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో పరిస్థితి కొంచెం వేరుగా ఉంటుంది. ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ ధోరణి, ప్రాజెక్ట్ డిమాండ్స్ మీద వర్కింగ్ అవర్స్ ఆధారపడి ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. ఇక తమిళంలో ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒక రోజు అదనపు షూటింగ్ కంటే.. రోజూ కొన్ని గంటలు అదనంగా పనిచేయడం సులువే కదా' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీపికా పదుకొణెళి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

## సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

### ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్





అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత-రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము' అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# ఐఎండీబీ పాపులర్ నటులు, దర్శకుల జాబితా

### సైయారా నటులు, దర్శకుడికి తొలిస్థానం

### తెలుగు నుంచి చోటు దక్కించుకోని తెలుగు స్టార్స్



సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్‌లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ఐఎండీబీ ప్రతి ఏడాది సినిమాలతో పాటు తారలకు సంబంధించి వివిధ కేటగిరీలలో ప్రేక్షకాదరణ పొందిన జాబితాను ప్రకటిస్తున్నది. తాజాగా ఈ ఏడాది పాపులర్‌గా నిలిచిన తారల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలుగు నుంచి ఒక్కరు కూడా చోటు దక్కించుకోకపోవడం విశేషం. సైయారా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న బాలీవుడ్ యువ నటులు ఆహన్ పాండే, అనిత్ పడ్డా.. వరుసగా మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది. ఇక కూలీ కామియోతో మెరిసిన ఆమిర్ ఖాన్ ఈ ఏడాది మోస్ట్ పాపులర్ తారల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. హోమ్ బౌండ్ సినిమాతో మెప్పించిన ఇషాన్ ఖట్టర్ నాలుగవ స్థానంలో నిలువగా.. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సినిమాతో అలరించిన నటుడు లక్ష్య ఐదవ స్థానంలో దక్కించుకున్నాడు. రష్మిక మందన్నా ఆరో స్థానంలో నిలువగా.. లోక చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కళ్యాణి ప్రియదర్శన్ ఏడో స్థానం దక్కించుకుంది. ధడక్ సినిమాలో నటనకు గాను తృప్తి డిమ్రి ఎనిమిదో స్థానంలో నిలువగా.. రుక్మిణి వసంత్ 9వ స్థానం, రిషబ్ శెట్టి 10వ స్థానం దక్కించుకున్నారుదర్శకుల జాబితాలో ఐఎండీబీ విడుదల చేసిన డేటా ప్రకారం ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులు ఎవరు అనేది చూసుకుంటే. సైయారాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులలో అగ్ర స్థానంలో నిలిచాడు. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో ఎంట్రీ ఇచ్చిన షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఈ ఏడాది రెండో స్థానంలో నిలిచాడు. కూలీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న లోకేష్ కనకరాజ్ మూడో స్థానంలో నిలువగా.. నిశాంచీతో హిట్ అందుకున్న అనురాగ్ కశ్యప్ నాలుగో స్థానంలో, ఎల్ 2 ఎంపురాన్ సినిమాతో హిట్ అందుకున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఐదో స్థానంలో నిలిచారు. ఆమిర్ ఖాన్‌తో సితారే జమీన్ పర్ లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న ఆరో స్థానంలో నిలువగా.. మెట్రో ఇన్ డినోతో అనురాగ్ బసు ఏడో స్థానంలో నిలిచాడు. మలయాళం కొత్త లోక సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు డొమినిక్ అరుణ్ ఎనిమిదో స్థానంలో చోటు దక్కించు కోగా.. ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ 9వ స్థానం, హోమ్ బౌండ్ చిత్రంతో నీరజ్ ఘైవాన్ 10వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు.

## ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

### అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**